దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ


Reg.No : AMC/NTR/DCO/2024/03
BHAVANI
BHAVANI MUTUALLY AIDED COOPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే గుర్తింపబడిన సంస్థ)
మీ పొదుపుకు... మీ రాబడి... బంగారు భవిష్యత్తు కోసం
చిన్న డిపాజిట్ ... పెద్ద రాబడి ...
Plot No. 71, Road No.3, P&T New Colony No.2, VIJAYAWADA - 520 008. Ph : 0866 2489456, M : 898 575 3456.


| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 72 | ది. 18-6-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 72 | Date : 18-6-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |


## యోగాడే కోసం కోటి దాటిన రిజిస్ట్రేషన్లు

● 20, 21వ తేదీల్లో బాబా రాందేవ్‌తో కలిసి హాజరు కానున్న సీఎం



**అమరావతి,జూన్ 17 (వార్తాప్రభ) :** సంజీవని కార్యక్రమంతో అనుసంధానం ద్వారా యోగాను రాష్ట్రంలో ప్రతీ ఇంటికి తీసుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆరోగ్యంపై అందరూ ధ్యాస పెట్టేలా....యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన యోగా డే కార్యక్రమం నిర్వహణపై అధికారులతో ముఖ్యమంత్రి సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. యోగాంధ్ర నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సీఎం నిర్దేశించారు. అత్యుత్త ప్రదర్శన కనపర్చిన యోగా మాస్టర్ ట్రైనర్లకు వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు ప్రత్యేక పురస్కారాలు అందజేయాలని సీఎం సూచించారు. "ఇంటింటికీ యోగా" ప్రధాన థీమ్‌గా ఏడాది పాటు కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు. వివిధ వైద్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక "థెరప్యూటిక్ యోగా" కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయాలని చెప్పారు. ఈసారి యోగా డేకు రాష్ట్రానికి ప్రత్యేక అతిధిగా వస్తున్న ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్‌తో కలిసి ఈనెల 20న ఉండవల్లి గుహల దగ్గర జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. 21వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్టేడియంలో 5 వేలు నుంచి 6 వేల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూడా బాబా రాందేవ్ సహా ముఖ్యమంత్రి హాజరవుతారు. వర్షం కారణంగా ఏమైనా అవాంతరం తలెత్తితే.. ప్రత్యామ్నాయంగా విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో వెయ్యి మందితో స్టేట్ ఈవెంట్ నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యోగా ప్రచారంలో భాగంగా 19వ తేదీనే రాష్ట్రానికి వస్తున్న బాబా రాందేవ్... అదే రోజు ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. యోగాంధ్రలో భాగంగా ఇప్పటివరకు 2.6 లక్షల మందిని ట్రైనర్లుగా తీర్చిదిద్దినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 21న యోగాడేలో పాల్గొనేందుకు ఇప్పటికే కోటికి మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ముఖ్యమంత్రికి తెలిపారు. 18వ తేదీ నుంచి 20 వరకు విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు అధికారులు వివరించారు. 21వ తేదీన 1.33 లక్షల సెంటర్లలో యోగా కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని సీఎంకు తెలిపారు. 21 తేదీన 'యోగాఏడెస్టినేషన్' పేరుతో వచ్చే ఏడాది యోగా డే వంటకు కేలండర్ ను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమీక్షకు ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.

## విద్యా వికాసం కోసమే "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్"

● ప్రతీ నియోజకవర్గానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్
● తరగతి గదుల్లోనే తెలంగాణ భవిష్యత్
● దేశానికి రోల్ మోడల్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం
● ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి





**హైదరాబాద్, జూన్ 17 (వార్తాప్రభ) :** విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపిండంలో భాగంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించి విద్యార్థులకు అంకితమిచ్చారు. తెలంగాణ భవిష్యత్ అద్దాల మేడలు రంగుల గోడల్లో లేదని, తరగతి గదుల్లోనే ఉందని తాము సంపూర్ణంగా విశ్వసించామన్నారు. అందుకే విద్యాకమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వం పాఠశాలలల్ని బలోపేతం చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఆరుట్ల గ్రామానికి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మాత్రమే స్ఫూర్తి కాదని, తెలంగాణలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని, ఒక ప్రభుత్వ పాఠశాలకు నో అడ్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి ఉందంటే విద్యా ప్రమాణాల్లో ప్రభుత్వ చిత్తశుద్ధి ఎలాంటిదో స్పష్టమవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా మెరుగైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెరిగేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి అభినందించారు. తెలంగాణలో ప్రతీ శాసన సభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని, ఈ స్కూల్స్ ద్వారా వచ్చే ఫలితాలు, సమస్యలను అవగాహన చేసుకుని రాష్ట్రంలో మరిన్ని తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటుపై ముందుకు వెళతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే ప్రభుత్వ పాఠశాలలను పునరుద్దరిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారు ఎందరో గొప్ప నాయకులుగా, అధికారులుగా ఎదిగారని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ప్రభుత్వ బడిలో చదువుకున్నవారేనని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని గుర్తు చేశారు. తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో బ్రతికేలా విద్యార్థులంతా విద్యలో రాణించాలని సూచించారు. ఐఏఎస్ లు, ఐపీఎస్ లు, అధికారులుగా, రాజకీయ నాయకులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని సీఎం గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంతో పాటు కిట్స్ ను అందిచే ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, డిసెంబరు 9 న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాన్ని ప్రారంభించుకోబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఇందుకోసం విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ఫుట్ బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ నగరానికి తీసుకువచ్చి విద్యార్థులతో ఫుట్ బాల్ ఆడించామని తెలిపారు. దీనిపై కొందరు రాజకీయ విమర్శలు చేశారని, కడుపులో కుల్లు పెట్టుకుని రాజకీయం చేయాలనుకుంటున్న వాళ్లకు భవిష్యత్ లో ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా మిగల్చరని హెచ్చరించారు. విమర్శించే వాళ్లకు ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను చూపించాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వానికి అంతా అండగా నిలిస్తే అద్భుతాలని సృష్టిస్తామని, తెలంగాణను దేశానికి రోల్ మోడల్ గా తీర్చి దిద్దుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

● అభిమాని నిరంజన్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు ● అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పణ
● అమ్మవారి వెండి ప్రతిమ తల్లిదండ్రులకు బహూకరించిన ఉప ముఖ్యమంత్రి





**వరంగల్,జూన్ 17 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వరంగల్ లోని విఖ్యాత శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. జన్యుపరమైన అరుదైన వ్యాధితో బాధ పడుతున్న తన అభిమాని నిరంజన్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ భద్రకాళి అమ్మవారికి ఆలయ సంప్రదాయాలను అనుసరించి పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. నిరంజన్ తల్లిదండ్రులతో కలసి మధ్యాహ్న కాల పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిరంజన్ కోసం ప్రత్యేకంగా చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను భద్రకాళి అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేయించారు. ఆ ప్రతిమను ఆలయ ప్రాంగణంలోనే నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు హారతులు ఇచ్చి, పవన్ కళ్యాణ్ కి వేదాశీర్వచనాలు అందజేశారు. అంతకు ముందు శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్ కి ఆలయ అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. భద్రకాళి అమ్మవారి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్థంబానికి మొక్కారు.

**జనసైనికులు, అభిమానుల ఘన స్వాగతం..** హన్మకొండ, వరంగల్ నగరాలకు విచ్చేసిన పవన్ కళ్యాణ్ కి జనసైనికులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. నిరంజన్ నివాస పరిసర ప్రాంతాలతోపాటు భద్రకాళి అమ్మవారి ఆలయ పరిసరాలు జనంతో కిక్కిరిశాయి. అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ జయజయ ధ్వానాలు చేశారు. పవన్ కళ్యాణ్ రహదారి పొడుగునా తన కోసం వచ్చిన అభిమానులు, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

**పర్యటనకు సహకరించిన తెలంగాణ సర్కారుకి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు..** ఈ సందర్భంగా తన వరంగల్ పర్యటనకు సహకరించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, తెలంగాణ ప్రభుత్వానికి, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి సహకరించిన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కి, వరంగల్ జిల్లా ఎస్పీ కి, భద్రతా విధుల్లో పాల్గొన్న పోలీసు యంత్రాగానికి, మద్దతుగా తరలివచ్చిన ప్రజలకు పవన్ కళ్యాణ్ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## సమాచార శాఖ జోన్ - 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ గా పి. తిమ్మప్ప

● జోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన పి. తిమ్మప్ప





**విజయవాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** సమాచార పౌర సంబంధాల శాఖ జోన్-2, విజయవాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా (రీజినల్ జాయింట్ డైరెక్టర్) పి. తిమ్మప్ప బుధవారం అధికారికంగా సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని ఎన్జీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లోని కమిషనరేట్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా, శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మప్ప మాట్లాడుతూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, తోటి అధికారులు, కార్యాలయ సిబ్బంది, జోన్ -2 పరిధిలోని డి.ఐ.పి.ఆర్.ఓ లు , డిప్యూటీ డైరెక్టర్లు, డీఈ లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఏఈ లు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారుల (డీఐపీఆర్వోలు) , పిఆర్వోలు , ఇంజనీరింగ్ సిబ్బంది సహకారం, సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మీడియా సమన్వయంతో ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరేలా సమాచార పౌర సంబంధాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల ప్రచారాన్ని మరింత సమర్థవంతంగా, ప్రజలకు చేరువయ్యేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని పి. తిమ్మప్ప తెలియజేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం లో జర్నలిజం లో పీజీ పూర్తి చేసి ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా 1996 లో సమాచార శాఖ పిఆర్వో గా చేరిన తరువాత 30 సంవత్సరాల సర్వీసులో అనంతపురం, కడప, కర్నూలు, తిరుపతి, తిరుమల, చిత్తూరు, హైదరాబాద్ సెక్రటేరియట్ లో పనిచేసారు. సమాచార శాఖ మాజీ మంత్రివర్యులు పల్లె రఘునాథరెడ్డి ఓఎస్డీ గా, సమాచార శాఖ కమిషనరేట్, కాకినాడ ఐ అండ్ పీ ఆర్ డీడీ గా పలు హోదాల్లో పనిచేయడంతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి ఉత్తమ అధికారిగా, 15 సార్లు ఉత్తమ అధికారిగా వివిధ కలెక్టర్ల నుంచి అవార్డులు పొందారు. ఇటీవల జేడీ గా ప్రభుత్వ ఉత్తర్వులతో పదోన్నతి, పోస్టింగ్ ఆర్డర్స్ తో ఆర్ జె డి జోన్ -2 గా ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని 8 జిల్లాలకు సమాచార శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ అధికారులతో, సిబ్బందితో సమావేశమై ప్రస్తుతం అమలులో ఉన్న కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న పనులు, శాఖా పరమైన ప్రాధాన్యత అంశాలపై సమీక్ష నిర్వహించి, సమన్వయంతో పనిచేసి శాఖ పనితీరును మరింత మెరుగుపర్చాలని పి. తిమ్మప్ప సూచించారు.

## 12 ఏళ్ల ప్రధాని మోదీ పాలనలో.. భారతదేశ ప్రగతి పథంలో సరికొత్త విప్లవం

● సామాన్యుడు సైతం విమానయానం చేయాలి ● దేశ అభివృద్ధికి అసలైన కొలమానం : 2014కు ముందు - మోదీ వచ్చిన తర్వాత ● మౌలిక సదుపాయాల బడ్జెట్ రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.12.02 లక్షల కోట్లకు పెంపు: ---- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ● దసరా ఉత్సవాల నాటికే నూతన టెర్మినల్ నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలి ● గన్నవరం విమానాశ్రయ నూతన టెర్మినల్ నిర్మాణ పనుల పరిశీలన కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ, జూన్ 17 (వార్తాప్రభ) :** స్వతంత్ర భారత చరిత్రలో దేశ అభివృద్ధిని బేరీజు వేయాలంటే మోదీకి ముందు - మోదీ తర్వాత అని సగర్వంగా చెప్పుకునే స్థాయికి నేడు భారతదేశం చేరుకుందని, ఒకప్పుడు దేశంలో మౌలిక వసతుల కల్పనకు కేవలం రూ.2 లక్షల కోట్లు కేటాయిస్తే, నేడు ఆ బడ్జెట్‌ను ఏకంగా రూ.12.02 లక్షల కోట్లకు పెంచిన ఘనత ప్రధాని మోదీ ప్రభుత్వానికే దక్కుతుంది అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతూ 12 వసంతాలు పూర్తి చేసుకున్న నరేంద్ర మోదీ పాలనలో మౌలిక వసతుల కల్పనలో నవశకం ప్రారంభమైందని ఆయన కొనియాడారు. ఈ చారిత్రక సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న గన్నవరం (విజయవాడ) విమానాశ్రయ నూతన టెర్మినల్ పనులను విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఇతర బీజేపీ నాయకులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ సంస్థ సిబ్బందిని, అధికారులను అడిగి నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ సవరించిన అంచనాల ప్రకారం రూ. 824.28 కోట్ల భారీ వ్యయంతో గన్నవరం విమానాశ్రయ నూతన టెర్మినల్ నిర్మితమవుతోంది అని బేస‌మెంట్‌తో కలుపుకుని మొత్తం 51,315 చదరపు మీటర్ల విశాలమైన వైశాల్యంలో ఈ నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. ఈ నూతన టెర్మినల్ ద్వారా ఏటా 3.5 మిలియన్ల ప్రయాణీకుల రద్దీని తట్టుకునేలా అత్యుత్తమ డిజైన్ రూపకల్పన తో రద్దీ సమయాల్లో ఒకేసారి 1,200 మంది ప్రయాణీకులను 800 మంది డొమెస్టిక్, 400 మంది ఇంటర్నేషనల్ సునాయాసంగా హ్యాండిల్ చేయగల అద్భుత సామర్థ్యం దీని సొంతం అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఇందులో 24 చెక్-ఇన్ కౌంటర్లు, 8 కస్టమ్స్ మరియు ఇమ్మిగ్రేషన్ కౌంటర్లు, 6 ప్యాసింజర్ బోర్డింగ్ బ్రిడ్జ్‌లు (ఏరోబ్రిడ్జ్), 9 డిపార్చర్ గేట్లు, 10 ఎస్కలేటర్లు, 19 ఎలివేటర్లు ఏర్పాటు అలాగే 648 కార్ల పార్కింగ్ సదుపాయంతో పాటు 1270 మీటర్ల పొడవైన ఎలివేటెడ్ రోడ్డును కూడా నిర్మిస్తున్నామని అని తెలిపారు. ఈ టెర్మినల్ నిర్మాణ పనులను 10 నవంబర్ 2026 నాటికి పూర్తి చేసి, 31 డిసెంబర్ 2026 నాటికి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా లక్ష్యంగా పెట్టుకుందని అయితే విజయవాడలో ఎంతో వైభవంగా నిర్వహించే దసరా ఉత్సవాల నాటికి నూతన టెర్మినల్ నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించినట్లు శ్రీనివాస వర్మ తెలిపారు. ప్రస్తుతం విజయవాడ నుండి కేవలం సింగపూర్‌కు మాత్రమే పాత టెర్మినల్ ద్వారా అంతర్జాతీయ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే, కొత్త టెర్మినల్‌లో మరిన్ని విదేశాలకు విమాన సర్వీసులు పెరిగే అవకాశం పుష్కలంగా ఉందన్నారు. ఉడాన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా వాడుకలో లేని 100 చిన్న విమానాశ్రయాలను అభివృద్ధి చేయడంతో పాటు కొండ, గిరిజన, ద్వీపకల్ప ప్రాంతాల్లో రవాణాను మెరుగుపరచడానికి 200 ఆధునిక హెలిప్యాడ్‌లను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది అని త్వరలోనే భోగాపురం విమానాశ్రయం ప్రారంభం కాబోతుందని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ నాయకత్వంలో పోర్టులు, రైల్వేల అభివృద్ధి, వందే భారత్, అమృత్ భారత్, హై స్పీడ్ కారిడార్లు, జాతీయ రహదారుల నిర్మాణంతో దేశవ్యాప్తంగా కనెక్టివిటీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి వెంట బిజెపి రాష్ట్ర కార్యాలయం ఇంఛార్జి ఉప్పలపాటి శ్రీ నివాస్ రాజు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి కృష్ణా జిల్లా బిజెపి అధ్యక్షుడు తాతినేని శ్రీ రాం, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం, రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారి దిలీప్,రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, మువ్వల వెంకట సుబ్బయ్య, గుత్తి కొండ శ్రీ రాజా బాబు, పిట్టల గోవిందు రామకృష్ణ తదితరులు ఉన్నారు

## గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

– రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,జూన్ 17 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో ఒక్క నిరుపేద కుటుంబం కూడా గుడిసెల్లో జీవించకుండా, ప్రతి కుటుంబం సురక్షితమైన సొంత ఇంటిలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఉ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, గుడిసెల గుర్తింపు, రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం, అసంపూర్తి గృహాల వివరాల సేకరణ తదితర అంశాలపై మంత్రి గారు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసిన తర్వాతే ఇతర దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

**గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే..** రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గుడిసెలను యుద్ధప్రాతిపదికన గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వద్ద ఇప్పటికే ఉన్న సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తులన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించాలని ఆదేశించారు.

## విద్యుత్ వినియోగదారుల అదాలత్

– ఏఈ బి రాజమహరావు



**విస్సన్నపేట,జూన్ 17 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో నూజివీడు రోడ్ లో ఉన్న కేకే సేవాసమితి కళ్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారులకు అదాలత్ మరియు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10:30 నుండి 1:00 వరకు నిర్వహించడం జరుగుతుందని ఏఈ బి రాజమోహనరావు మీడియాకు తెలియజేశారు. ఎన్ విక్టర్ ఇమ్మానియేల్ ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని కరెంటు బిల్లులకు సంబంధింత సంబంధిత సమస్యలను పరిష్కరించుకునే సువర్ణవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పుట్రేల మారెమ్మ అమ్మవారికి చిరు కానుకగా ఊరేగింపు రథం



**విస్సన్నపేట,జూన్ 17 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల మారెమ్మ అమ్మవారి ఆలయానికి 1979 –80 పుట్రేల జడ్పీ హైస్కూల్ టెన్త్ పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు సంయుక్త సహాయ సహకారాలతో అమ్మవారికి ఊరేగింపు రథంతో పాటు రేకుల షెడ్ నిర్మించడం నిర్మించి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి వాసు బాబు, ఆలయ చైర్మన్ టి శ్రీనివాసరావు, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి, పుట్రేల గ్రామ టిడిపి అధ్యక్షులు అరిగే శ్రీనివాసరావు,ఆలయ మాజీ చైర్మన్ కోటగిరి సునీల్ బాబు,డి దామోదర రెడ్డి, తాళ్ల రామమోహన్ రెడ్డి,హై స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి, పుర ప్రముఖులు పాల్గొన్నారు,

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్వో కే లక్ష్మీ కళ్యాణి



**విస్సన్నపేట,జూన్ 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా పారదర్శకత కోసం కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇన్ టెన్సివ్ రివిజన్ ) 20 26 ప్రక్రియ స్థానిక మండలంలో కొనసాగుతున్న క్రమంలో మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి పాల్గొన్నారు. దాదాపు 24 సంవత్సరాల తర్వాత సమగ్రంగా జరుగుతున్న ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు (బి ఎల్ ఓ ఎస్) ఇంటింటికి తిరిగి కార్యక్రమంను ఆమె పర్యవేక్షించారు. జులై 14 వ తేదీ వరకు ఇంటింటి సర్వే మరియు ఫారాల సేకరణ జరుగుతుందని జూలై 21 తేదీన ప్రాథమిక ఓటర్ల జాబితా ముసాయిదా విడుదలవుతుందని, ఆగస్టు 20వ తేదీ వరకు అభ్యంతరాలు పేర్ల తొలగింపు లేదా మార్పులకు అవకాశం ఉంటుందని తుది జాబితా అన్ని విచారణల అనంతరం సెప్టెంబర్ 22వ తేదీ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రకటించడం జరుగుతుంది అని ఎమ్మార్వో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ సర్వే డ్యూటీ విజయభాస్కర్ పాల్గొన్నారు.

## ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం



**తిరువూరు,జూన్ 17 (వార్తాప్రభ) :** తిరువూరు గత వారం రోజులుగా బానుడు ప్రతాపంతో అల్లాడిపోయిన ప్రజలు ఉష్ణోగ్రతల పెరగడంతో వృద్ధులు చిన్నపిల్లలు వేసవి తపన తట్టుకోలేక బయటికి రాక ఇళ్ళకే పరితమయ్యారు ఒక్కసారిగా వాతావరణం మార్పు రావడంతో గాలి వాన ఉరుములతో వర్షం చల్లబడ్డ వాతావరణం వేసవి తపన నుండి చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్న ప్రజలు గంట నుండి కురుస్తున్న భారీ వర్షం

## జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ సానా సతీష్ బాబు



**కాకినాడ, జూన్ 17 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా రాజ్యసభ సభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్ బాబు బుధవారం జగ్గంపేటలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను, పార్టీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, జిల్లాలో పార్టీ కార్యకలాపాల విస్తరణ, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై తొలిసారి జగ్గంపేటకు విచ్చేసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును పార్టీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఘనంగా సత్కరించారు.

# ప్రతి రైతుకు, కౌలు రైతుకు సమృద్ధిగా యూరియా అందిస్తాం - జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

● యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ● యాప్ ఆధారిత పంపిణీ విధానంతో పారదర్శకతకు ప్రాధాన్యం ● రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి.● అవనిగడ్డ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలించిన కలెక్టర్.



**అవనిగడ్డ,జూన్ 17 (వార్తాప్రభ) :** రానున్న ఖరీఫ్ సీజన్‌కు కృష్ణా జిల్లాలో ప్రతి రైతుకు, కౌలు రైతుకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని, ఎలాంటి కొరత ఉండబోదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి స్పష్టం చేశారు. యూరియా పంపిణీలో పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ఆధారిత విధానంలో రైతులందరూ నమోదు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు. బుధవారం ఉదయం కలెక్టర్ అవనిగడ్డ మండలంలోని అవనిగడ్డ --1 రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన యూరియా పంపిణీ విధానంపై స్వయంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం యూరియా పంపిణీని యాప్ ఆధారంగా నిర్వహించే కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు నేరుగా, పారదర్శకంగా యూరియా అందించాలనే ఉద్దేశంతో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. గతంలో ఎవరైనా యూరియా కొనుగోలు చేసే అవకాశం ఉండేదని, అయితే ప్రస్తుతం నిజమైన రైతుకే మొదటి ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. యాప్ అమలులో మొదటి సంవత్సరం కావడంతో అనుకోని సాంకేతిక సమస్యలు తలెత్తినా, వాటి పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు ఎదుర్కొనే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.రైతులు, కౌలు రైతులు తప్పనిసరిగా తమ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇంట్లో స్మార్ట్‌ఫోన్ ఉన్న వారు సమీప రైతు సేవా కేంద్రానికి వెళ్లి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సహాయంతో నమోదు చేసుకోవచ్చని, స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు కూడా కేంద్రాల్లోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పొలం విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన మేర యూరియా అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ, రైతులందరూ సహకరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ అధికారిణి జ్యోతి రమణి, మార్క్‌ఫెడ్ డిఎం మురళీ కిషోర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు, మండల తహసిల్దార్ బి అంకాలు, ఏవో టి హారిక, ఏడిఏ జె జయప్రద, గ్రామ వ్యవసాయ సహాయకులు పి ఉదయ్ కుమార్, జి తేజస్వి, ఉద్యాన అధికారి ఎన్ రమేష్, రైతులు ఉన్నారు.

## చినగొల్లపాలెం గ్రామంలో కొబ్బరి తోటల రైతులకు రాయితీ పై పీఎండ్స్ విత్తనాల కిట్లు ఎరువులు అందజేత



**కృత్తివెన్ను,జూన్ 17 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఉద్యానశాఖ కొబ్బరి అభివృద్ధి మండలి సీడీబీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నాడు కృతివెన్ను మండలం చినగొల్లపాలెం గ్రామంలో కొబ్బరి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కొబ్బరి సాగులో ఉత్పాదకత పెంపు, వాతావరణ మార్పుల ప్రభావాల నిర్వహణ, అలాగే కొబ్బరి రైతులు మరియు కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలపై సంబంధిత అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖాధికారి జె జ్యోతి కొబ్బరి అభివృద్ధి మండలి అమలు చేస్తున్న ప్రొడక్టివిటీ ఇంప్రూవ్మెంట్ కోకోనట్ బేసడ్ క్రాపింగ్ సిస్టంస్ పిక్స్ పథకం గురించి వివరించారు. అర్హులైన రైతులకు ఎరువులు మరియు పోషకాల కిట్లను పంపిణీ చేశారు. ఈ పథకం కింద కొబ్బరి తోటల ఉత్పాదకత పెంపు కోసం హెక్టారుకు సంవత్సరానికి రూ. 21,000 చొప్పున, రెండు సంవత్సరాల కాలానికి మొత్తం రూ. 42,000 విలువైన కొబ్బరి సాగుకు అవసరమైన ఎరువులు, పోషకాలు మరియు ఇతర ఇన్‌పుట్లు ఉచితంగా సరఫరా చేయబడతాయని తెలిపారు. 5 సంవత్సరాలు పైబడిన లేదా 5 సంవత్సరాల లోపు కాపుకు వచ్చే కనీసం 10 కొబ్బరి చెట్లు కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులని, గరిష్టంగా 2 హెక్టార్ల విస్తీర్ణం వరకు లబ్ధి పొందవచ్చని వివరించారు. ఈ పథకం ద్వారా కొబ్బరి చెట్ల ఎదుగుదల మెరుగుపడి, స్థిరమైన అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతుల ఆదాయం పెరుగుదలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఏపీసీన్స్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పార్థ సారథి మాట్లాడుతూ కొబ్బరి తోటలలో పీఎండ్స్ ప్రెమొన్సూ డ్రై సౌయింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తూ, ఈ విధానంలో పప్పుధాన్యాలు, నూనెగింజలు, పచ్చిరొట్ట పంటలు మరియు ఇతర కవర్ క్రాప్స్‌ను కొబ్బరి తోటల మధ్య సాగు చేయడం ద్వారా సంవత్సరమంతా నేలపై గ్రీన్ కవర్ ఏర్పడి, నేలలో తేమ సంరక్షణ, సేంద్రియ పదార్థాల పెరుగుదల, పోషకాల వినియోగ సామర్థ్య మెరుగుదల మరియు సూక్ష్మ వాతావరణం మైక్రో క్లైమేట్ పరిరక్షణ సాధ్యమవుతుందని వివరించారు. ముఖ్యంగా ఈ సంవత్సరం సూపర్ ఎల్–నినో ప్రభావం వల్ల ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలు, తేమ కొరత పరిస్థితులను అధిగమించడంలో పీఎండ్స్ విధానం సమర్థవంతంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇసుక నేలల్లో పోషకాల లభ్యతను పెంచడంతో పాటు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఈ విధానం దోహదపడుతుందని పేర్కొన్నారు. కేర సురక్ష యోజన కొబ్బరి చెట్లెక్కే కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న "కేరా సురక్ష" పథకం గురించి ఉద్యాన అధికారి జె కీర్తి వివరించారు. ఈ పథకం ద్వారా ఈ రంగంలో పని చేసే కార్మికులకి ప్రమాద బీమా మరియు సామాజిక భద్రత కల్పించబడుతోంది. వార్షిక ప్రీమియం రూ. 956 కాగా అందులో రూ. 813 85 శాతంను కొబ్బరి అభివృద్ధి మండలి సీడీబీ భరిస్తుంది. మిగిలిన రూ. 143లో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ లేబర్ వెల్ఫేర్ ద్వారా రూ. 100 చెల్లించగా, లబ్ధిదారుడు కేవలం రూ. 43 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద లబ్ధిదారులకు రూ. 7 లక్షల వరకు బీమా రక్షణ కల్పించబడుతుందని ఉద్యాన అధికారి తెలిపారు. కొబ్బరి రైతులు మరియు కార్మికులు ఈ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకొని ఉత్పాదకత పెంపుతో పాటు ఆదాయాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యవసాయ విధానాల అమలు మరియు బీమా ద్వారా సామాజిక భద్రతను పొందాలని అధికారులు కోరారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. రమాదేవి రైతులకు ఫ్స్ ఫ్రేమవర్క్ ఫర్ ఫర్టిలైజర్ సాలె యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానం, దాని ప్రయోజనాలు మరియు వినియోగంపై వివరంగా తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి ఏపీసీన్స్ డీపీఎం పార్థసారథి అడిషనల్ డి పి ఏ మ్ నాగ మల్లేశ్వరి మండల వ్యవసాయ అధికారి పి.ఎమ్.కిరణ్, ఎంపీటీసీ సాధనాల బాబ్జీ దిశ డైరెక్టర్ టి.బలరామ్ గారు రైతుల తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేనేత కార్మికుల కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

● నిర్ణయించిన రౌండ్ టేబుల్ సమావేశం..



**పెడన,జూన్ 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పెడన సర్వోదయ సొసైటీలో కృష్ణా జిల్లా స్థాయి 'రౌండ్ టేబుల్ సమావేశం అత్యంత కీలక చర్చలతో ము–ుగిసింది. దశాబ్దాలుగా చేనేత రంగం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు కార్మికుల దుర్భర స్థితిగతులకు కారణమైన చేనేత వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఈ సమావేశంలో నాయకులు ఎండగట్టారు.

**సమావేశంలో నాయకుల విశ్లేషణ:** ఈ సందర్భంగా పలువురు చేనేత సంఘం నాయకులు మాట్లాడుతూ "చేనేత రంగం నేడు మనుగడ కోసం పోరాడుతోంది. ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకుంటున్నట్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కార్మికులకు మాత్రం ఏమాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. పెరుగుతున్న ముడిసరుకు ధరలు గిట్టుబాటు కాని మజూరీలు మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం వల్ల నేతన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కార్మికుడికీ అందాలనీ మగ్గంపై పని చేసే వారికి ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

**కలెక్టరేట్ ముట్టడికి కార్యాచరణ:** ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తమ పోరాటాన్ని ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిలో భాగంగా ఈ నెల 22వ తేదీ, సోమవారం నాడు భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు.

**నిరసన ప్రదర్శన:** సోమవారం ఉదయం మచిలీపట్నంలోని లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద నుండి చేనేత కార్మిక సంఘాలన్నింటిని ఏకం చేస్తూ, జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. చేనేత కార్మికులకు, చేనేత సహకార సంఘాలకు జరుగుతున్న అన్యాయంకు వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.

**మెమొరాండం సమర్పణ:** కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన సమగ్ర మెమొరాండాన్ని అందజేయనున్నట్లు నాయకులు ప్రకటించారు.

**ప్రధాన డిమాండ్లు:** చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వ బకాయిలను తక్షణం చెల్లించాలి. చేనేత కార్మికులు ప్రతి ఒక్కరికీ నేతన్న నేస్తం 25 వేల రూపాయలు వెంటనే అందించాలి. చేనేత వస్త్రాలపై జి ఎస్ టీ రీయింబర్స్మెంట్ అమలుచేయాలి. చేనేత ఉత్పత్తులకు ప్రభుత్వం నేరుగా మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. మగ్గాల ఆధునీకరణకు మరియు కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. చేనేత కార్మికులపై ఉన్న పాత బకాయిలను రద్దు చేసి కొత్తగా వడ్డీ లేని రుణాలు అందించాలి. "ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించే వరకు ఈ పోరాటం ఆగదు" అని నాయకులు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి కో కన్వీనర్ భండారు ఆనంద ప్రసాద్ పిల్లలమర్రి బాలకృష్ణ, రామనాథం పూర్ణచంద్ర రావు ఏ ఐ డబ్ల్యూ ఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షులు– పిచ్చుక ఫణికుమార్, ప్రధానకార్యదర్శి – ఆకురాతి జనార్ధన్, కోశాధికారి – బాలాజీ కాలేవు సూరిబాబు, గోరు రాజు పంచల నరసింహారావు వాసా గంగాధర రావు కృష్ణా జిల్లాకు చెందిన వివిధ చేనేత సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కామ్రేడ్ వేడుకొండలకు నివాళ్లులు అర్పించిన సీపీఐ నేతలు



**పెనుగంచిప్రోలు, జూన్ 17 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని ముచ్చింతాల గ్రామం లో గత నెలరోజుల నుండి అనారోగ్యం తో బాధపడుతున్న సీపీఐ కార్యకర్త ఇండ్ల వేదు కొండలు (55) బుధవారం మృతి చెందగా విషయం తెలియగానే సీనియర్ సీపీఐ నాయకులు వలం కొండ బ్రహ్మం, సీపీఐ నాయకులు మాజీ ఎంపిపి పొన్నం నరసింహారావు, పద్మాల వెంకటేశ్వర రావు, చల్లాల శివాజీ, కోలకాని అర్జున రావు,లు వేదు కొండలు మృత దేహం పై ఎర్ర జెండా కప్పి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్ల లు అర్పించి కుటుంభానికి సంతాపం తెలిపి సానుభూతి తెలిపారు. వేదు కొండలకు భార్య తిరుపతమ్మ, కుమారులు సురేష్, రమేష్ వున్నారు వేదు కొండలు మృతి తో ఎస్.టి. కాలనిలో విశాద చాయలు అలుముకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి యాటగిరి వెంకటేశ్వర్లు, చల్లాల వీర భద్ర చారి, వేల్పుల కాంతయ్య, కోలకాని వీరయ్య, జక్కులూరి వెంకటేశ్వర్లు, పద్మాల మునసూబు, ఇండ్ల నాగేశ్వర రావు తదితరులు పాల్గొని కామ్రేడ్ వేదు కొండలు కుటుం భానికి ఎల్లవేళలా భారత కమ్యూనిస్టు పార్టీ ( సీపీఐ ) అండగా ఉంటుందని వారు తెలిపారు..

## శ్మశానవాటికను ఏర్పాటు చేయాలి సానా సతీష్ బాబును కలిసిన క్రిస్టియన్ కౌన్సిల్





**కాకినాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** జగన్నాధపురంలో క్రైస్తవుల కోసం శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మోసా అబ్రహాం కోరారు. బుధవారం రెండవ సారి రాజ్యసభ సభ్యుడుగా బాధ్యతలు చేపట్టిన కాకినాడకు విచ్చేసిన సానా సతీష్ ను క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జగనాధపురంలో క్రైస్తవుల కోసం శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు సనా సతీష్ బాబు సానుకూలంగా స్పందించారు. క్రైస్తవులకు స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో క్రైస్తవుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. మోజీస్ కుమార్, ఎస్. ప్రభాకర్,సురేష్ జాన్సన్, డి. చార్లెస్, ఎస్. విజయ్ కుమార్ , పి. సాల్మన్ రాజు, ఎం జాన్ పాల్ , ప్రదీప్ కుమార్ కదారి, ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జంక్షన్ లో ఘనంగా జరిగిన లయన్ కళ్లేపల్లి నారాయణరావు జన్మదిన వేడుకలు





**హనుమాన్ జంక్షన్,జూన్ 17 (వార్తాప్రభ) :** తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న అజాత శత్రువు,రిటైర్డ్ ఉద్యోగి కళ్లేపల్లి నారాయణరావు అభినందనీయుడని విజయా డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మంగళవారం సాయంత్రం హనుమాన్ జంక్షన్ లో పుట్టగుంట కాంప్లెక్స్ లో కళ్లేపల్లి జన్మదిన వేడుకలను స్నేహితుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిగం స్వామి, చలసాని రాజా, త్రిపురనేని సత్యన్నారాయణ, మిక్కిలినేని ఈశ్వరరావు, అక్కినేని రాఘవేంద్రరావు , పాలడుగు శ్రీధర్,కన్నెగంటి రంగారావు,మిక్కిలినేని అప్పారావు,గొంది శరత్, శొంఠి నాగరాజు, పుట్టగుంట విష్ణు,హనుమంతు నాగేశ్వరరావు,పాలడుగు పిచ్చేశ్వరరావు సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు. కాగా వైష్ణవి స్టూడియో లో నారాయణరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ వేడుకల్లో స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్య ప్రసాద్,చక్రపాణి విజయ కుమార్,తాడి రంగారావు, రొంపల్లి అచ్యుతరావు, మోగంటి కొండ,అంబళ్ల వెంకట రంగారావు, గంటా శ్రీనివాస్, గార్లపాటి రాజేశ్వరరావు,తొమ్మండ్రు రమేష్, కొలపల్లి మల్లేశ్వరరావు, కొప్పుల మహేష్ , తవ్వా సురేష్, దాసరి కళ్యాణ్, వల్లభనేని ప్రభాకరరావు,కోలుకొండ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారిగా సత్యనారాయణ



**అమలాపురం,జూన్ 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ( ఏపీపీటీడీ), డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారిగా నియమితులైన జి. సత్యనారాయణ బుధవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. జి. సత్యనారాయణ ఇంతకుముందు విజయనగరం జిల్లాలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్స్ ఓ కమర్షియల్) డిప్యూటీ. టసిటిఎం ( ఓ & సి)రి గా విధులు నిర్వహించారు. రవాణా రంగంలో విశేష అనుభవం కలిగిన ఆయన, సంస్థ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన రవాణా సేవల అందజేత, ఆదాయ వృద్ధి మరియు సేవల నాణ్యత పెంపుదలకు కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు . డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రజా రవాణా సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయన నాయకత్వం దోహదపడుతుందని అధికారులు మరియు సిబ్బంది ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఆర్టీసీ సిబ్బంది పుష్ప గుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

# వ్యక్తి కాదు... మానవతా మూర్తి!!

**అభయాంజనేయ స్వామిపై అపార భక్తి**
**దేవాలయాల అభివృద్ధే ధర్మ పరిరక్షణ - హారీష్ రెడ్డి**



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక చైతన్యానికి అండగా నిలుస్తూ ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. జనగామ గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి పనుల కోసం ఆలయ కమిటీ అధ్యక్షులు నడిపెల్లి గోపాలరావు, జనగామ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామల ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన హరీష్ రెడ్డి రూ.30 వేల ఆర్థిక విరాళాన్ని బుధవారం అందజేశారు. దేవాలయాల అభివృద్ధి అంటే కేవలం నిర్మాణ పనులు మాత్రమే కాదని, భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అది బలమైన పునాది అని ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతకు మంచి విలువలను అందిస్తాయని అన్నారు. శ్రీ పాటి అభయాంజనేయ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు నీలం సంజీవ్ పటేల్, ఆరేళ్ల రవితేజ, పోలాడి శ్రీనివాసరావు తదితరులు హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన సేవా భావం యువతకు ఆదర్శమని కొనియాడారు. దేవాలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు, దాతలు మరింతగా ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

**-ఎం.ఎల్.ఏ.అరికపూడి గాంధీ**





**శేరిలింగంపల్లి,జూన్ 17 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రజయ్ షెల్టర్,జనప్రియ వెస్ట్ సిటీ, నాగార్జున ఎన్‌క్లేవ్ కాలనీలలో రూ.1.88 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.అభివృద్ధి పనులను నాణ్యతతో,త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్,నార్నె శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలి.

**-సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల పూజా మహోత్సవంలో కోరుకున్న కాంగ్రెస్ ఇంచార్జి బండి రమేష్**



**మియాపూర్,జూన్ 17 (వార్తాప్రభ):**మియాపూర్‌లో నిర్వహించిన శ్రీ సమ్మక్క--సారలమ్మ అమ్మవార్ల పూజా మహోత్సవ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరై అమ్మవార్ల ఆశీస్సులు పొందారు.శ్రీ రాచమల్ల కృష్ణ పటేల్ మరియు వారి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన బండి రమేష్,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్, రాచమల్ల ఓం ప్రకాష్ గౌడ్, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, రామచంద్ర, బాలింగ్ యాదగిరి గౌడ్, వీరేందర్ గౌడ్, కరుణాకర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, భాస్కర్ గౌడ్, తిరుపతి, తాండ్ర రాంచందర్ గౌడ్, మహేందర్ ముదిరాజ్, రవికుమార్ గౌడ్, వాసు, దినేష్ గౌడ్, గిరి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ భవనానికి భూమి కేటాయింపు హర్షణీయం

**కామారెడ్డి,జూన్;17(వార్తాప్రభ):** జిల్లా కాంగ్రెస్ పార్టీ భవనానికి జిల్లా కేంద్రంలో భూమి కేటాయించడం పట్ల జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు శాశ్వత చిరునామాగా ప్రజల సమస్యలను తీర్చే దిశగా జిల్లాలో భవన నిర్మాణానికి భూమి కేటాయింపుతో చారిత్రాత్మక అడుగు పడిందని ఆయన అన్నారు

# చెత్త వేస్తే చలానా.. ఆక్రమిస్తే కూల్చివేత..!!

● పరిశుభ్రతపై నగర పాలక సంస్థ ఉక్కుపాదం ● స్వచ్ఛ రామగుండం కోసం కఠిన చర్యలు ● ఫొటో తీస్తారు... ఫైన్ వేస్తారు ● రామగుండం మేయర్ మహంకాళి స్వామి





**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నగరాన్ని పరిశుభ్రంగా, వరదల రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నగర పాలక సంస్థ కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇకపై రోడ్లు, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త పారబోసే వారిపై ఉక్కుపాదం మోపాలని మేయర్ మహంకాళి స్వామి అధికారులను ఆదేశించారు. బుధవారం ఇందిరానగర్‌లో నిర్వహించిన ప్రత్యేక పర్యటనలో మేయర్ స్వయంగా ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ, చెత్త వేస్తూ పట్టుబడిన వారిపై అక్కడికక్కడే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. నగర పరిశుభ్రతకు ఆటంకంగా మారిన ఆక్రమణలను ఉపేక్షించబోమని, ప్రజల భద్రత, సౌకర్యాల కోసం అవసరమైతే కూల్చివేత చర్యలు కూడా చేపడతామని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేసి వరద ముప్పును తగ్గిస్తున్నామని వెల్లడించారు. ఆర్ఎఫ్సీఎల్ నీటి ప్రవాహం వల్ల ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ఇందిరానగర్ ప్రజలకు శాశ్వత పరిష్కారం అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇళ్ల ముందు, రోడ్లపై, కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించాలని ప్రజలకు సూచించారు. ప్రతి కాలనీ చివరి ఇంటి వరకు మౌలిక వసతులు చేరేలా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సులభంగా వెళ్లేందుకు వీధులను విస్తరించే కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఇదే సమయంలో మద్యం దుకాణం ఎదుట రోడ్డును ఆక్రమించిన నిర్మాణాన్ని అధికారులు తొలగించగా, కాలువలో ఖాళీ సీసాలు పారబోసిన దుకాణ యజమానిపై భారీ జరిమానా విధించేందుకు చర్యలు ప్రారంభించారు. పరిశుభ్రత విషయంలో ఎవరిపట్లా రాజీ ఉండదని, శిక్షలతో పాటు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బాధ్యత పెంచుతామని కమిషనర్ అరుణ శ్రీ తెలిపారు. స్వచ్ఛమైన, సుందరమైన, సురక్షితమైన రామగుండం నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు.

# సింగరేణి బాయిబాటలో కార్మికుల మధ్య కవిత!!

● గని కార్మికుల కష్టాలు విన్న టీఆర్ఎస్ అధినేత్రి ● ఆటోలో ప్రయాణించి ఆటో కార్మికుల సమస్యలపై ఆరా ● కార్మిక సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి ● హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం చేస్తాం ● తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత





**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కవిత చేపట్టిన "సింగరేణి బాయిబాట" కార్యక్రమం బుధవారం గోదావరిఖని 11 ఇంక్లైన్ వద్ద కొనసాగింది. ఈ సందర్భంగా గని కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించిన ఆమె, వారి సమస్యలు, ఇబ్బందులు, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో కార్మికులకు అండగా నిలబడటం తమ బాధ్యత అని తెలియజేస్తూ, సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని భరోసా ఇచ్చారు. భూగర్భ గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు తగిన భద్రతా చర్యలు, మెరుగైన వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆటోలో ప్రయాణించిన కవిత, ఆటో కార్మికుల దైనందిన జీవన పరిస్థితులను స్వయంగా తెలుసుకుని వారి సమస్యలను విన్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు, విడిభాగాల ఖర్చులు, తగ్గుతున్న ఆదాయంతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆటో కార్మిక కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. కార్మికుల చెమటతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, వారి కష్టాలను విస్మరించడం సరికాదని అన్నారు. సింగరేణి కార్మికులు, ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు పాల్గొని కవితకు తమ సమస్యలను వివరించారు. ఈ బాయిబాట కార్యక్రమంలో కవిత వెంట టిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పడాల మనోజా గౌడ్, హెచ్ఎంఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

# మల్కాజిగిరి చౌరస్తాలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**మల్కాజిగిరి :జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు జేపీసీ వెంకన్న ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జన హృదయనేత, మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత నిరంతర శ్రామికుడు, పరిపాలన సమర్థుడు ఆధునికతకు పట్టంకట్టే నాయకుడు తన విలువలు విజయంతో ప్రజా సమస్యల పరిష్కారం తో పాటు సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని మల్కాజిగిరి నియోజకవర్గం సమగ్రాభి వృద్ధే లక్ష్యంగా పనిచేస్తు ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండే నాయకుడు శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అని ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి , మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సునీత రాము యాదవ్, మురుగేష్,చిన్న యాదవ్, నర్సింగ్, ఉపేందర్, నీలం సతీష్, , కాటంరాజు, బాబు పటేల్, సిద్ది రాములు, రాము యాదవ్,గంగాధర్ కృష్ణ, సైదులు, గణేష్, నరహరి, కరీం,రమేష్, భాగ్యనంద్, బిక్షపతి,, సతీష్, సిక్కు ప్రభాకర్,శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, రాములు, రామకృష్ణ ,నవీన్, కుమార్, కిరణ్, కొటేష్, అనిల్, వెంకటేష్, శ్రీకాంత్, చంద్రమౌళి, ఫరీద్, నర్సింగ్ రావు,లక్ష్మణ్, శ్రీధర్, శారద, అనిల్, సంతోష్ గుప్తా, తులసి సురేష్, మల్లేష్ యాదవ్, కిట్టు, రామచందర్, పిఎస్ శ్రీనివాస్, నర్సింగ్ రావు,శ్రీనివాస్,శ్రీకాంత్ యాదవ్, జంగా రాజు, బాబన్న, వెంకటేష్, వేణు యాదవ్, సురేష్,నరేష్, బాలకృష్ణ,ఉమేష్,వాసు, పాషా, శివ గౌడ్, మల్లేష్, సుమన్,వినీత్, జోగు శ్రీనివాస్, శంకర్, కృష్ణ, ప్రభాకర్, భారీ ఎత్తున బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూమాఫియాపై ఉక్కుపాదం మోపాలి- ఎంపీ ఈటల రాజేందర్



**మల్కాజిగిరి జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హైదరాబాద్ నగరంలో పేదవాడు జీవించే పరిస్థితి రోజురోజుకు కష్టతరమవుతోందని, ఇల్లు నిర్మించుకోవడానికి కనీస స్థలం కూడా అందుబాటులో లేకుండా పోతోందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు.కంటోన్మెంట్ పరిధిలోని సర్వే నంబర్లు 57/1, 157/1 భూముల సమస్యపై స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 70--80 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన పేదలు ఆనాడు డిమాండ్ లేని ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని జీవనం ప్రారంభించారని, కానీ నేడు పేదలకు ఇల్లు కట్టుకునేందుకు 20 గజాల స్థలం కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు.ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, ప్రజా అవసరాల కోసం కూడా భూములు అందుబాటులో లేకపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వ భూముల ఆక్రమణలేనని ఆయన పేర్కొన్నారు. కొందరు భూ కబ్జాదారులు, పైరవీకారులు, అవినీతి అధికారులతో కుమ్మక్కై వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు ఆస్తులుగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.షంషీగూడ ఎల్లమ్మబండలోని వందల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, ఒకప్పుడు పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూములనే నేడు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అలాగే బాలానగర్--తిరుమలగిరి గ్రామాల మధ్య ఉన్న సుమారు 8 ఎకరాల భూమిని కూడా కొందరు భూమాఫియా వ్యక్తులు ప్రైవేటు భూమిగా చిత్రీకరించారని విమర్శించారు.సర్వే నంబర్లు 57/1, 157/1లో తరతరాలుగా నివసిస్తున్న పేద కుటుంబాలను ఖాళీ చేయించే ప్రయత్నాలు అన్యాయమని, తాము ప్రజల పక్షాన నిలబడి అలాంటి ప్రయత్నాలను అడ్డుకున్నామని తెలిపారు. గత 25 నుంచి 30 ఏళ్లుగా రికార్డుల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములుగా చూపించే కుట్రలు జరిగాయని ఆరోపించారు.ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు ఇళ్ల స్థలాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, పిల్లలకు ఆటస్థలాలు ఏర్పాటు చేయాలి. భూమాఫియాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజల పన్నులతో జీతాలు పొందుతున్న అధికారులు ప్రజల పక్షాన పనిచేయాలని, ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు జవాబుదారులనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# వార్తాప్రభ హైదరాబాద్

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి దంపతులు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నంజాతనగర్,కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ 21 వ డివిజన్ పరిధిలోని దేగలమడుగు, నాయకులగూడెం, గొల్లగూడెం లోని మండల ప్రాథమిక పరిషత్ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను స్థానిక కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి సాయికుమార్ దంపతుల చేతుల మీదుగా పంపిణీ చేశారు అనంతరం కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు చదువు పట్ల శ్రద్ధ,ఆసక్తి కలిగి ఉండాలని,చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం ప్రాథమిక విద్య బోధనలో ముందు ఉంటుందని విద్యార్థుల మరియు పాఠశాల సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకవస్తే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయులకు తెలిపారు . ప్రముఖ వ్యాపారవేత్త చింతలపూడి సాయికుమార్ విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు,తదితర సామాగ్రి అందచేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, మునిసిపల్ అధికారులు,అంగన్వాడీలు స్థానిక గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లా ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వరస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజ్ మహమూద్ కుటుంబానికి బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో చెక్కు రూపంలో 1,00,000/-(లక్ష రూపాయల) నగదును ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు మరియు సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.మరణించిన పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.ప్రభుత్వం తరపున మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు తెలిపారుఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ఏవో మంజ్యా నాయక్, పోలీస్ అధికారుల సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆరోహి ఇంటర్నేషనల్ స్కూల్ శుభారంభం

**-ప్రారంభించిన బిజెపి ఇన్చార్జి రవికుమార్ యాదవ్**



**శేరిలింగంపల్లి,జూన్ 17 (వార్తాప్రభ):**కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోహి ఇంటర్నేషనల్ స్కూల్‌ను శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎం. రవికుమార్ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు అందుబాటులో అన్ని సౌకర్యాలతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ఆధునిక భవనంలో స్కూల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపకుండా నాణ్యమైన విద్యను అందించేందుకు తక్కువ ఫీజులతో ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు.విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తూ,తల్లిదండ్రుల విశ్వాసాన్ని నిలబెట్టేలా స్కూల్ యాజమాన్యం కృషి చేయాలని సూచించారు.నాణ్యతతో కూడిన విద్యా సేవల ద్వారా సంస్థ మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు డా.దినేష్ భరత్, రేఖ, విజయలక్ష్మి, అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బ్రాండింగ్‌లో బాబు-పవన్ తర్వాతే ఎవరైనా..!

### ఇలా ఎందుకు అంటున్నారంటే..?

రాజకీయాల్లో పొత్తులు పెట్టుకోవడం, ఎన్నికల్లో గెలవడం ఒక ఎత్తయితే.. గెలిచిన తర్వాత అదే సమన్వయాన్ని ప్రదర్శిస్తూ ప్రభుత్వాన్ని నడపడం, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడం మరో ఎత్తు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య కనిపిస్తున్న బంధం కేవలం రాజకీయ అవసరాల కోసం మాత్రమే కాకుండా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పడిన బలమైన పునాదిగా చెప్పుకుంటున్నారు. ఇందుకు తగ్గట్టే ఆ ఇద్దరు నేతలు నడుచుకుంటున్నారని జాతీయ స్థాయిలో రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి కట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఇద్దరు నేతలు 'ఒకే మాట.. ఒకే బాట.. ఒకటే బాణం' అన్నట్లుగా సాగుతున్నారని అంటున్నారు. వీరి మధ్య ఉన్న ఈ అద్భుతమైన బాండింగ్.. ఇప్పుడు రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో 'బ్రాండింగ్' తీసుకువస్తోందని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒకే విధమైన ఆలోచన ధోరణితో నడుచుకుంటున్నారనే అభిప్రాయానికి తాజా ఉదాహరణ అరకు కాఫీ అంటున్నారు. ఉత్తరాంధ్ర మన్యం ప్రాంత గిరిజన రైతులు పండించే అరకు కాఫీ ఒకప్పుడు సరైన గుర్తింపు లేని ఉత్పత్తిగా మిగిలిపోయేది. కానీ, అరకు కాఫీ విశిష్టతను గతంలోనే గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, దానికి ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఏపీకి వచ్చే విదేశీ ప్రతినిధులకు, ప్రముఖులకు అరకు కాఫీని బహుమతిగా ఇస్తూ ఆయనే దానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. ఇప్పుడు సరిగ్గా అదే బాటలో నడుస్తున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. రెండురోజుల క్రితం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన పవన్.. తనతో పాటు ప్రత్యేకంగా అరకు కాఫీ పొడి ప్యాకెట్లను తీసుకెళ్లారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసినప్పుడు, వారిని సత్కరించి అరకు కాఫీని గిఫ్ట్‌గా అందించారు. పవన్ చేతిలో అరకు కాఫీని చూడగానే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సంభ్రమాశ్చర్యాలకు గురికావడం విశేషం. గతంలో చంద్రబాబు చేసిన బ్రాండింగ్‌ను, ఇప్పుడు పవన్ కల్యాణ్ అంతే స్థాయిలో ముందుకు తీసుకెళ్తుండడం వీరిద్దరి మధ్య ఉన్న ఆలోచనా విధానాల సమన్వయానికి అద్దం పడుతోందని అంటున్నారు. సాధారణంగా కూటమి ప్రభుత్వాల్లో భేదాభిప్రాయాలు, ఆధిపత్య పోరాటాలు ఎక్కడైనా సహజంగా కనిపిస్తుంటాయి. కానీ, ఏపీలో చంద్రబాబు అనుభవం, పవన్ కల్యాణ్ లక్ష్యం కలిసి ఒక అద్భుతమైన సమన్వయాన్ని సృష్టించాయని అంటున్నారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా, ఏ వేదికపై మాట్లాడినా ఇద్దరి స్వరం ఒక్కటిగానే వినిపిస్తోందని చెబుతున్నారు. ఒకరు రాష్ట్రానికి సీనియర్ గైడ్‌గా దిశా నిర్దేశం చేస్తుంటే.. మరొకరు అంతే బాధ్యతగల నాయకుడిగా భారాన్ని భుజాన వేసుకుంటున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ పరస్పర గౌరవం, అవగాహన కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా పరిపాలనలోనూ స్పష్టంగా ప్రతిబింబిస్తోందని చెబుతున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించాలన్నా, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా, స్థానిక ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ లభించాలన్నా.. పాలకులపై ప్రపంచానికి నమ్మకం కలగాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ అభిప్రాయంగా చెబుతున్నారు. ఈ ఆలోచనతోనే తమ మధ్య చక్కని సమన్వయం పాటిస్తూ దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల్లో ఆ నమ్మకాన్ని రెట్టింపు చేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక గిరిజన రైతుల సంక్షేమం కోసం అరకు కాఫీని ప్రమోట్ చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే వ్యూహాన్ని ఇద్దరూ సమానంగా అమలు చేయడం దీనికి ఒక నిదర్శనమని అంటున్నారు.

## యోగం జీవన విధానం - ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అవసరం- జి. నరసింహ యాదవ్



**చంద్రగిరి, జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని చంద్రగిరి రాయలవారి కోటలో బుధవారం "యోగాంధ్ర--2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ మరియు రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు జి. నరసింహ యాదవ్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఆర్డీవో, ఆర్టీవో, తహసీల్దార్, ఎంపీడీవో తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలు మరియు సమాజాభివృద్ధిలో యోగా పాత్రపై వివరించారు. ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఉత్తమ మార్గమని, ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలని వారు సూచించారు. యోగా ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఆందోళనలు, జీవనశైలి సంబంధిత వ్యాధులను అధిగమించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. యోగం జీవన విధానం – – ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సందేశంతో నిర్వహించిన యోగాంధ్ర--2026 కార్యక్రమం ప్రతి ఒక్కరిలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు. యోగాను ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని అధికారులు, ప్రముఖులు పిలుపునిచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై యోగా సాధనలో పాల్గొన్నారు.



# ఖాళీగా ఉన్న హెడ్‌మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి

### హై స్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను డిప్లాయ్‌మెంట్ ద్వారా పరిష్కరించాలి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ, జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న హెడ్‌మాస్టర్ గ్రేడ్-2 (గెజిటెడ్) మరియు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా తక్షణమే భర్తీ చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అనేక పాఠశాలల్లో హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యా, పరిపాలనా కార్యక్రమాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థుల బోధన, పాఠశాలల నిర్వహణ, విద్యా ప్రమాణాల పరిరక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.70, సాధారణ పరిపాలన శాఖ, తేదీ 15-06-2026 ప్రకారం స్థానిక కేడర్ల ఏర్పాటు పూర్తయ్యే వరకు పదోన్నతులు ఇవ్వడానికి ఎటువంటి అడ్డంకి లేదని, అలాంటి పదోన్నతులు చెల్లుబాటు అవుతాయని స్పష్టత ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ తక్షణమే పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఖాళీగా ఉన్న హెడ్‌మాస్టర్ పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అన్ని పదోన్నతుల ప్రక్రియలను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో అనేక సబ్జెక్టులలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొంటూ, రెగ్యులర్ భర్తీలు జరిగే వరకు తక్షణ అవసరాల మేరకు డిప్లాయ్‌మెంట్ విధానంలో ఉపాధ్యాయులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులు ఒకవైపు ఉద్యోగుల న్యాయమైన హక్కులను పరిరక్షించడంతో పాటు మరోవైపు పాఠశాలల్లో బోధన, పరిపాలన సమర్థవంతంగా కొనసాగేందుకు దోహదపడతాయని నాయకులు తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఖాళీల భర్తీ ప్రక్రియను ప్రారంభించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# వర్షపు నీటి నిల్వల నివారణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

- కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం లబ్బీపేట, ఏ-కన్వెన్షన్ రోడ్, పైడయ్య రోడ్, ఫకీర్ గూడెం మెయిన్ రోడ్ తదితర ప్రాంతాలను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షాలు కురిసిన సమయంలో బెంజ్ సర్కిల్, ఎంజీ రోడ్ పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడటానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థలో కనెక్టివిటీ సక్రమంగా ఉందా, ఎక్కడైనా గ్యాప్‌లు ఉన్నాయా, నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. డ్రైనేజీ కనెక్టివిటీని మెరుగుపరచడంతో పాటు గుర్తించిన గ్యాప్‌లను వెంటనే సరిచేసి, వర్షాల సమయంలో రహదారులపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రాణిగారితోటలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్‌లో ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకొని, నాణ్యమైన భోజన సేవలు నిరంతరంగా అందేలా అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంచార్జ్ రామా రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు శుద్ధమైన త్రాగునీరు అందించేందుకు

# పటిష్ట చర్యలు చేపడుతున్నాం

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజలకు నాణ్యమైన, శుద్ధమైన త్రాగునీరు నిరంతరాయంగా అందించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ అన్ని స్థాయిల్లో పటిష్ట చర్యలు చేపడుతోందని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బుధవారం ఉదయం భవానీపురంలోని కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్సును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్రాగునీటి శుద్ధి, నిల్వ, సరఫరా వ్యవస్థల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్యం దృష్ట్యా త్రాగునీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద నీటి శుద్ధి ప్రక్రియ నుంచి ప్రజలకు సరఫరా అయ్యే చివరి దశ వరకు ప్రతి అంశాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. నగరంలోని అన్ని ఈఎస్ఎల్ఆర్‌లు, జీఎస్ఎల్ఆర్‌లు వద్ద క్రమం తప్పకుండా నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నీటి నాణ్యత ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ఎక్కడైనా లోపాలు తలెత్తే అవకాశాలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అలాగే త్రాగునీటి రిజర్వాయర్ల నుంచి ప్రజలకు సరఫరా చేసే పైప్‌లైన్ వ్యవస్థను కూడా నిరంతరం తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు చేరే ప్రతి నీటి బొట్టు సురక్షితంగా, శుద్ధంగా ఉండేలా ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతిరోజూ నిరంతరాయంగా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించడంతో పాటు సంబంధిత ఇంజినీరింగ్ మరియు వాటర్ సప్లై విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో త్రాగునీటి సరఫరా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని కమిషనర్ తెలిపారు. శుద్ధమైన త్రాగునీటి సరఫరా నగరపాలక సంస్థ ప్రధాన ప్రాధాన్యతగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ (ఇన్‌చార్జ్) పి. సత్యకుమారి, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ మరియు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న 'యోగాంధ్ర' వేడుకలు

### విజయవంతంగా 11వ రోజు కార్యక్రమం పూర్తి.



**విజయవాడ పశ్చిమ జూన్ 17:(వార్తా ప్రభ ప్రతినిధి)** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని (ఇంటర్నేషనల్ యోగా డే) పురస్కరించుకుని, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న 'యోగాంధ్ర' ప్రత్యేక శిక్షణ మరియు అవగాహన కార్యక్రమం బుధవారం తో విజయవంతంగా 11వ రోజుకు చేరుకుంది. భక్తులు, ఆలయ సిబ్బంది మరియు స్థానిక యోగా సాధకులలో ఆరోగ్య చైతన్యాన్ని నింపడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజూ ఉదయం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహిస్తున్నారు.? 11వ రోజు కార్యక్రమంలో భాగంగా నడుము నొప్పి, కీళ్ల నొప్పుల నివారణకు ఉపయోగపడే ప్రత్యేక యోగాసనాలతో పాటు... మానసిక ప్రశాంతతను, ఏకాగ్రతను పెంపొందించే 'ప్రాణాయామం', 'ధ్యానం' (మెడిటేషన్) లపై యోగా నిపుణులు క్షేత్రస్థాయిలో సాధకులకు రాజ గోపురం ముందు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నిత్య జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఏ విధంగా దోహదపడుతుందో ఈ సందర్భంగా నిపుణులు వివరించారు. ముఖ్యంగా నిత్యం విధుల్లో బిజీగా ఉండే ఆలయ అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో సూచించారు.? రోజురోజుకూ ఈ 'యోగాంధ్ర' కార్యక్రమానికి ఆదరణ పెరుగుతోంది. ఇటు అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు, అటు దేవస్థాన సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొంటూ ఉచితంగా యోగాసనాలను నేర్చుకుంటున్నారు.?ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా ఒక ముఖ్య భాగమని, ఈ యోగాంధ్ర శిబిరాన్ని భక్తులు, సిబ్బంది మరింతగా సద్వినియోగం చేసుకోవాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ కోరారు.

## పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగ పిల్లలకు అన్న సమారాధన



**ఇబ్రహీంపట్నం, జూన్ 17(వార్తా ప్రభ ప్రతినిధి):** గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్, కొండపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు బసవ ఉమామహేశ్వరరావు జన్మదిన వేడుకలు సహాయ మాత పాఠశాలలో దివ్యాంగ పిల్లల మధ్య నిడారంబరంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పిల్లలకు తినిపించారు. అనంతరం పిల్లలకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. బసవ ఉమామహేశ్వరరావు దంపతులు స్వయంగా దివ్యంగా పిల్లలకు అన్నం వడ్డించారు. పిల్లల మధ్య జన్మదిన జరుపుకోవడం ఎంతో సంతోషకరంగా అనిపించిందని ఈ సందర్భంగా ఆయన తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలి





**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యార్థులు సామాజిక బాధ్యతలను పెంపొందించుకున్నప్పుడు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అగిరిపల్లి ఎమ్మార్వో పీఎస్వీ ప్రసాద్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో మూడో సంవత్సరం బీటెక్ చదువుతున్న విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా అగిరిపల్లి, పైడురపాడు తదితర గ్రామాల్లో సామాజిక సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజఅల జీవన విధానం, పారిశుధ్య పరిస్థితులు, ఆరోగ్యం, విద్యా, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ అక్షరాస్యత తదితర అంశాలపై ప్రజల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన పీఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రజల జీవన ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చదువుతో పాటుగా సమాజాన్ని సైతం అర్థం చేసుకొని ముందుకు అడుగులు వేస్తే మంచి విజయాలను అందుకుంటారని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా ఈ విధమైన ప్రాజెక్ట్‌ల ద్వారా మరింత విజ్ఞానాన్ని పొందుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పీ శిల్ప తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాల్వల్లో ముమ్మరంగా డీ-సిల్టింగ్ పనులు





**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలోని ప్రధాన కాల్వల్లో డీ-సిల్టింగ్ పనులను వేగవంతంగా చేపడుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం బందర్ రోడ్డులో విజయకృష్ణ సూపర్ మార్కెట్ సమీపంలోని కాల్వలో సూపర్ సక్కర్ యంత్రం ద్వారా నిర్వహిస్తున్న డీ-సిల్టింగ్ పనులను చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె. అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-2 గోపాల కృష్ణమూర్తి సంయుక్తంగా తనిఖీ చేశారు. వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చేయడం, నీటి నిల్వలను నివారించడం మరియు వరద ముప్పును తగ్గించడం లక్ష్యంగా కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పనుల పురోగతిని పరిశీలించిన అధికారులు డీ-సిల్టింగ్ కార్యక్రమాన్ని మరింత వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వర్షాకాలానికి ముందుగానే అన్ని ప్రధాన కాల్వలను శుభ్రపరిచే చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఇంజనీరింగ్ మరియు ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బూత్ స్థాయిలో ఓట్లు వెరిఫికేషన్



**చేజర్ల జూన్ 17 (వార్తాప్రభ)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం చేజర్ల గ్రామ పంచాయతీ లోని 264, 265, బూత్ లలో బూత్ స్థాయి ఓట్లు వెరిఫికేషన్ సంబంధిత అధికార సిబ్బంది ఓట్ల పరిశీలించడం జరిగినది. ఇందులో భాగంగానే చేజర్ల మండల సొసైటీ అధ్యక్షులు బూదల్ల వీరరాఘవ రెడ్డి టిడిపి పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సోమవరపు హజరత్తయ్య బూత్ కన్వీనర్లు అరవ దామోదర్ రెడ్డి ఆత్మకూరు పెంచలయ్య మరియు బిఎల్ఓ కలిసి ఓట్లు వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొనడం జరిగింది.

# జీవితమే సముద్రం



కడలిలాంటి జీవితము
ఆటుపోట్లకది నిలయము
తట్టుకుంటే విజయము
అంతులేని సంతసము
ఎగసిపడే కెరటాలు
గుండెలోని కోరికలు
అదుపు లేక కల్లోలము
ఆఖరికి పెను విషాదము
కెరటాల్లా ఆరాటము
ఎడతెగని పోరాటము
సముద్రంతో పోలికలు
మానవుని జీవితాలు
చేస్తేనే నియంత్రణ
జీవితాల్లో రక్షణ
ముందుచూపే ముఖ్యము
లేదంటే బహు నష్టము

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# అధిక ధరకు యూరియా విక్రయం

**రైతు సేవా కేంద్రాలలో రైతులకు అందని యూరియా**
**కొత్తగా వచ్చిన యాప్ ద్వారా యూరియా తీసుకోవాలని**
**రైతులకు చెప్పడంలో అధికారులు విఫలం**

**చేజర్ల జూన్ 17 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలలో యూరియా పంపిణీ జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన విధానం ప్రకారం రైతులకు ఎకరాకు మూడు కట్టలు చొప్పున యూరియా ఇవ్వవలసి ఉంది అయితే ఏ రైతు సేవా కేంద్రంలో కూడా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్లైన్ విధానం యాప్ ద్వారా రైతులకు యూరియా అందవలసి ఉంది.అయితే చేజర్ల మండలంలో రైతులకు అవగాహన లేక యాప్ ద్వారా రైతులు యూరియాను కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. మండల అగ్రికల్చర్ అధికారి రైతులకు అవగాహన పరచడంలో విఫలమయ్యారని పలువురు రైతులు వాపోతున్నారు .రైతులకు పూర్తిస్థాయిలో యూరియా ఏ విధంగా కొనుగోలు చేయాలి ఎవరిని సంప్రదించాలి ఎలా మనం దానిని పొందాలి అనే ముఖ్యమైన అంశాలను రైతులకు వివరించలేకపోతున్నారని పలువురు రైతులు నుండి వస్తున్న సమాచారం.ఇదిలా ఉంటే చేజర్ల సొసైటీలో యూరియా లేకపోవడం తో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండల వ్యవసాయ శాఖ అధికారిని యూరియా ఎందుకు రావడం లేదు అని




అడిగితే యూరియా లైసెన్స్ ఎక్స్పైరింగ్ అయిపోయింది. రెన్యువల్ కి పెట్టారు.ఇంకా లైసెన్స్ రాలేదు అని చెప్పడం గమనార్హం. వ్యవసాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా కొద్ది మంది రైతులకు యాప్ ద్వారా అవగాహన చేసి మిగతా మొత్తం సోషల్ మీడియాలో పెట్టి మీరే తెలుసుకోండి మీరే చేసుకోండి అనే విధంగా చెప్పడంతో వ్యవసాయ అధికారులపై మండల స్థాయిలో రైతులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేజర్ల మండలంలోని పలు ప్రైవేట్ డీలర్లు యూరియా విక్రయం 330 రూపాయలకు విక్రయిస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. అధిక మొత్తంలో రైతుల నుండి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు ప్రభుత్వం ధర ఒక కట్ట 266 రూపాయలు ఉండగా ప్రైవేట్ డీలర్లు దగ్గర మాత్రం 320 రూపాయలకు అమ్మడంతో రైతులకు తీవ్రంగా నష్టపోతున్నారని తెలుపుతున్నారు.దీనిపై వ్యవసాయ అధికారులను భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కుంకు బాలయ్య నాయుడు అడగగా మా దగ్గర యూరియా అందుబాటులో లేదు ప్రైవేట్ డీలర్లు దగ్గర మాత్రమే మీరు తీసుకోవాలి వాళ్ళు ఎలా అమ్ముతారో మాకు తెలియదు అని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏది ఏమైనను చేజర్లలో వ్యవసాయ శాఖ అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులకు ఏ విధమైన అవగాహన లేకుండా వచ్చామా ఏదో ఒక గ్రామంలో ఒక సమావేశం పెట్టి ఫోటో తీసుకొని వెళ్ళిపోదామన్నట్లుగా వ్యవహరిస్తున్నారని కొంతమంది రైతులుతో పాటు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కుంకు బాలయ్య నాయుడు కూడా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**చేజర్ల మండల వ్యవసాయ శాఖ అధికారి వివరణ** ప్రస్తుతం యూరియా బ్యాగ్స్ సొసైటీలో లేవు..ప్రైవేట్ డీలర్లు దగ్గర ఉన్నాయి. 266 రూపాయలు ఒక కట్టకు ప్రభుత్వం ధర అయితే 300 కి ప్రైవేట్ డీలర్లు అమ్ముకోవచ్చు అని వివరణ ఇచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఏఐఎస్ఎఫ్, సిపిఐ నాయకుల డిమాండ్**



**జవహర్ నగర్, జూన్ 17:(వార్తా ప్రభ)** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్, సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటపల్లి శంకర్ (మాజీ ఎంపిటిసి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని జవహర్ నగర్ ఫైరింగ్ కట్ట ప్రభుత్వ పాఠశాలను వారు క్షేత్రస్థాయిలో సందర్శించారు.ఈ సందర్భంగా నాయకులు పాఠశాలలో అందుతున్న మధ్యాహ్న భోజన సదుపాయాలను, నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అనంతరం క్లాస్ రూమ్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులపై ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మౌలిక సదుపాయాల లేమితో విద్యార్థులు ఇబ్బంది పడకుండా అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని తోటపల్లి శంకర్, అన్వర్ పేర్కొన్నారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి. స్వరూప నాయక్, గిరిప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి కొండా సత్యం సాగర్, ఏఐటియుసి కాప్రా మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, సిహెచ్. మాధవి, డి. మల్లిక తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రగిరి గోవిందధామం త్వరలో ప్రజలకు అందుబాటులోకి : ఎమ్మెల్యే పులివర్తి నాని

**కైలాసధామం నిర్మాణానికి దాతల విరాళాలు - అభినందించిన ఎమ్మెల్యే**



**చంద్రగిరి, జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చంద్రగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గోవిందధామం పనులు త్వరలోనే పూర్తవుతాయని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. బుధవారం గోవిందధామం నిర్మాణ ప్రాంగణాన్ని కమిటీ సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఇప్పటికే పూర్తయిన భవనాలు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించి గుత్తేదారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా గోవిందధామాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.అలాగే చంద్రగిరిలో నిర్మిస్తున్న కైలాసధామం కోసం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. లేట్ బండారు రుద్రయ్య కుమారుడు, రిటైర్డ్ ఎస్‌బీఐ ఉద్యోగి బండారు చంద్రశేఖర్ రూ.10,116 విరాళంగా అందజేశారు. అలాగే లేట్ బండి గంగిరెడ్డి కుమారుడు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి బండి మునిరత్నం రెడ్డి రూ.5,000 విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని, కైలాసధామం కమిటీ సభ్యులు దాతలను అభినందించి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోవిందధామం, కైలాసధామం కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ పాలన 2 సంవత్సరాల విజయోత్సవ సభలో పాల్గొన్న శాసనసభ్యులు



**జగ్గయ్యపేట జూన్ 17 (వార్తప్రభ)** కూటమి ప్రభుత్వం పాలన రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మరియు కేంద్రంలో మోదీ గారి ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటుపల్లి సి ఏ కన్వెన్షన్ హాల్‌లో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ అధ్యక్షతన నిర్వహించిన విజయోత్సవ సభలో జగ్గయ్యపేట శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , కే డి సి సి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ పాల్గొన్నారు.

## కృష్ణా మిల్క్ యూనియన్ కామధేను ప్లాంట్ రుణ విముక్తి వేడుకలు

**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తిదారుల చిరకాల స్వప్నం సాకారం, ప్రాజెక్ట్ కామధేను ప్లాంట్, వీరవల్లి యొక్క రూ.110 కోట్ల బ్యాంకు రుణాన్ని కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే పూర్తిగా తీర్చిన సందర్భంగా, విజయవాడ ఫ్యాక్టరీ ఆవరణ లో రీజినల్ వర్క్ షాప్ ఆన్ వైట్ రెవల్యూషన్ 2.0 సదస్సు లో కేక్ కట్ చేసి చారిత్రాత్మక విజయాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ ఘనంగా నిర్వహించారు.పాల ఉత్పత్తిదారుల చిరకాల స్వప్నమైన ప్రాజెక్ట్ కామధేను విజయవంతంగా సాకారమైందని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు.వీరవల్లి గ్రామంలో రోజుకు 6 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ సామర్థ్యంతో, భవిష్యత్తులో 8 లక్షల లీటర్లకు విస్తరించే వీలున్న అత్యాధునిక పూర్తి ఆటోమేషన్ ప్లాంట్‌ను రూ.185 కోట్ల అంచనాతో ప్రారంభించి, కేవలం రూ.163 కోట్ల వ్యయంతో పూర్తి చేయడం సమితికి ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.110 కోట్ల బ్యాంకు రుణాన్ని 7 సంవత్సరాల కాలపరిమితితో తీసుకున్నప్పటికీ, సమితి ఆర్థిక క్రమశిక్షణ, సమర్థ నిర్వహణ, పాడి రైతుల సహకారంతో కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే పూర్తిగా చెల్లించడం అసాధారణ విజయమని తెలిపారు. ఈ ప్లాంట్ కు మ్యాక్స్ చట్ట రూపకర్త దివంగత నందమూరి తారక రామారావు ప్లాంట్ గా నామకరణం చేసి కృష్ణా జిల్లా రైతాంగమునకు మరియు భవిష్యత్తు తరాలకు అంకితం చేయటం జరిగిందని ఈ సందర్భముగా తెలిపారు.బుడమేరు వరద ముంపు సమయంలో 42 రోజులు విజయవాడ ఫ్యాక్టరీ మూతబడి 24 కోట్ల నష్టం వాటిల్లినప్పటికీ ముందు చూపుతో నిర్మించిన కామధేను ఫ్యాక్టరీలో మొత్తం ప్రాసెసింగ్ జరిపి, పాడి రైతులు, సమితి సిబ్బంది, వినియోగదారుల సహకారంతో రోజువారీ నిర్వహణలో ఎటువంటి ఆటంకం లేకుండా సమితి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించగలిగిందని తెలిపారు.ఈ అసాధారణ విజయానికి కారణమైన పాడి రైతులు, పాల సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు, ఉద్యోగులు అందరికీ ఛైర్మన్ గారి మరియు పాలకవర్గ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా గత ఏడు సంవత్సరాలలో కృష్ణా మిల్క్ యూనియన్ సాధించిన ప్రగతిని వివరించారు.పాల సేకరణ ధరను కేజీ ఫ్యాట్‌కు రూ.280 మేర (లీటరుకు సుమారు రూ.28) పెంచి కేజీ ఫ్యాట్ ను 850 చేర్చాము పాల సేకరణ 71 శాతం పెరిగి 10.33 కోట్ల లీటర్లకు చేరుకుంది.గత ఐదు సంవత్సరాలలో ధర వ్యత్యాసం (బోనస్) రూపంలో రైతులకు రూ.250 కోట్లకు పైగా చెల్లించబడిందని ఛైర్మన్ వివరించారు. అలాగే2025-26 ఆర్థిక సంవత్సరంలోనే రైతులకు రూ.45 కోట్ల బోనస్ పంపిణీ చేయబడింది.యూనియన్ వార్షిక



టర్నోవర్ 78 శాతం వృద్ధితో రూ.1,273 కోట్లకు చేరుకుంది.యూనియన్ నికర ఆస్తుల విలువ రూ.95 కోట్ల నుండి రూ.256 కోట్లకు పెరిగి 168 శాతం వృద్ధిని సాధించింది.పాడి రైతుల సంక్షేమ కార్యక్రమాల కోసం సమితి సేకరించే ప్రతి లీటర్ పాలపై రూ.2కు పైగా ఖర్చు చేస్తోందని ఛైర్మన్ తెలిపారు. అలాగే వినియోగదారుల నుండి ఆర్జించే ప్రతి రూపాయిలో సుమారు 85 శాతం మొత్తాన్ని పాడి రైతులకు అందజేస్తు దేశంలోనే అరుదైన సహకార పాల సంస్థగా కృష్ణా మిల్క్ యూనియన్ నిలిచిందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వ రీజినల్ వర్క్ షాప్ ఆన్ వైట్ రెవల్యూషన్ 2.0 సదస్సు కృష్ణా మిల్క్ యూనియన్ విజయవాడ మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణ లో ఈరోజు నిర్వహించటం జరిగింది.ఈ సందర్భంగా దయానంద్ సావంత్, డిప్యూటీ కమిషనర్ (డైరీ డెవలప్‌మెంట్), పశు సంవర్ధక మరియు డెయిరీ విభాగం, కేంద్ర ప్రభుత్వం, అజయ్ యాదవ్,ఐ ఏ ఎస్ , మేనేజింగ్ డైరెక్టర్, తమిళనాడు కోఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ మరియు రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్, తమిళనాడు ప్రభుత్వం, శ్రీమతి రోమీ జాకబ్, దక్షిణ ప్రాంతీయ అధిపతి (సౌత్ రీజినల్ హెడ్)దక్షిణ ప్రాంతం, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ , అధికారులు, అలాగే వైట్ రివల్యూషన్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల కు సంబంధించిన వివిధ సహకార డెయిరీ ల నుండి విచ్చేసిన చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్ల సమక్షంలో కేక్ కట్ చేసి రూ.110 కోట్ల రుణాన్ని పూర్తిగా చెల్లించిన ఈ చారిత్రాత్మక విజయాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ ఘనంగా జరుపుకున్నది.ఈ సందర్భంగా వారందరూ కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులుకి, మేనేజింగ్ డైరెక్టర్ కి, పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ని పూల మాలతో ఘనంగా సత్కరించారు.

## సమాచార శాఖ డిడి కి ఘన సన్మానం

**మచిలీపట్నం జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో ప్రభుత్వ పథకాలను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ డిడి వెంకటేశ్వర ప్రసాద్ ఎంతగానో కృషి చేశారని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కొనియాడారు.సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ యమ్. వెంకటేశ్వర ప్రసాద్ కు జాయింట్ డైరెక్టర్ గా పదోన్నతి లభించిన నేపథ్యంలో బుధవారం నగరంలోని గాంధీనగర్ వాకర్స్ అసోసియేషన్ హాలులో ఏపీ యోగాసభ ఆధ్వర్యంలో నిత్య యోగ సాధన అనంతరం వెంకటేశ్వర ప్రసాద్ ను కలెక్టర్ డికె బాలాజీ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటేశ్వర ప్రసాద్ సమయపాలన పాటిస్తూ, క్రమశిక్షణ తో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు.జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలందరికీ తెలియజేసేందుకు ఎంతో కృషి చేశారన్నారు.అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో తనకు వెన్నుదన్నుగా నిలిచి విశిష్ట సేవలు అందించారన్నారు.ఏపి యోగ సభ తరపున చేస్తున్న యోగా కార్యక్రమాలలో వెంకటేశ్వర ప్రసాద్ స్వయంగా పాల్గొంటూ ఎప్పటికప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రాచుర్యం కల్పించారని , తద్వారా ప్రజలకు యోగా పట్ల మంచి అవగాహన కల్పించేందుకు అవిరళ కృషి చేశారని, వారు చేసిన సేవలు మరువలేనివని, పలువురు వక్తలు కొనియాడారు.అనంతరం సమాచార



శాఖ డిడి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో దాదాపు 2 సంవత్సరాలుగా యోగా సాధన చేస్తున్నానని, తనకు ఆరోగ్యంతో పాటు ఒత్తిడి లేకుండా మానసిక ప్రశాంతత లభించడంతో ఉద్యోగ విధులు సజావుగా నిర్వహించగలుగుతున్నానని, అందులకు జిల్లా కలెక్టర్కు, ఉచితంగా యోగ నేర్పిస్తున్న గురువులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో యోగ గురువులు ఘంటసాల గురునాథబాబు, మద్దాల చింతయ్య, శీలం రమేష్, వడ్డీ శ్రీనివాస్, అశోక్ మాస్టారు, ఆర్ డి ప్రసాద్ పలువురు యోగ సభ్యులు పాల్గొన్నారు.

## కోనేరు సెంటర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన.



**మచిలీపట్నం జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రోడ్డు ప్రమాదాల నివారణ మరియు హెల్మెట్ వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో మచిలీపట్నంలోని కోనేరు సెంటర్ వద్ద బుధవారం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఆదేశాల మేరకు, బందరు సబ్ డివిజన్ ఇంచార్జి డీఎస్పీ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, బందరు ట్రాఫిక్ సీఐ నున్నా రాజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, ఆటో డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ ఉపయోగించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని సూచించారు. అలాగే అతివేగం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతుందని హెచ్చరించారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించరాదని, ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

## గోమాతకు భారతరత్న ఇవ్వాలి

**ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ బాబా**




**ఇబ్రహీంపట్నం, జూన్ 17(వార్తా ప్రభ ప్రతినిధి):**కోట్ల మంది భారత దేశంలో హిందువులు ఆరాధించే గోమాత కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు అల్తాఫ్ రజా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కోట్ల మంది విశ్వాసాలను గౌరవించి గోమాతకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ సబ్కా సాత్ సబ్కా వికాస్ అనే నినాదంతో 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ కు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ... భారతదేశ అభివృద్ధి సమిష్టి కృషితోనే సాధ్యమవుతుందని, ఆందోళనలు రాస్తారోకోలు తో సమస్యలు పరిష్కారం కాదని అన్నారు. అన్ని మతాలవారు మైత్రితో ప్రతి చోట సమస్య పరిష్కారం కోసం కూర్చుని సమస్యని పరిష్కారం చేసుకోవాలని అందరూ కలిసికట్టుగా భారత దేశ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మోయిన్ సాజిద్ హుస్సేన్. మాజీ శాసనసభ్యులు ఉత్తరప్రదేశ్ నసీమహమ్మద్. తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్ట్ కుటుంబాలకు అండగా ఉంటా

**ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్**
**జర్నలిస్టుల పిల్లలకు నోటుపుస్తకాల పంపిణీ**



**ఇబ్రహీంపట్నం, జూన్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి):**మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా జర్నలిస్టుల పిల్లలకు బుధవారం ఇబ్రహీంపట్నంలోని స్వర్ణ కన్వెన్షన్ హాల్‌లో నోటుపుస్తకాలు, జామెంట్రీ కిట్స్ పంపిణీ చేశారు.మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్వయంగా పుస్తకాలను అందజేశారు.ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజెఎఫ్), ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీబిజెఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, వారి కుటుంబాలకు అండగా ఉండడం తన బాధ్యత అన్నారు.పగలు, రాత్రి తేడా లేకుండా వార్తల కోసం శ్రమించే మీడియా సోదరుల పిల్లల చదువులకు సాయం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సంఘాల ప్రతినిధులు, మీడియా సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

## కులాలు,మతాల మధ్య చిచ్చు పెడుతున్న గొడ్డలి పార్టీ అధ్యక్షుడు లెవెన్ రెడ్డి

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**
**ఎన్డీఏ ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ**



**ఇబ్రహీంపట్నం, జూన్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి):**కులాలు, మతాల మధ్య గొడ్డలి పార్టీ అధ్యక్షుడు లెవెన్ రెడ్డి చిచ్చు పెడుతున్నాడని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ మండిపడ్డారు.రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయోత్సవ సభ బుధవారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని సీఏ



కన్వెన్షన్ హాల్లో ఘనంగా ప్రారంభమైంది. మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆతిథ్యంలో నిర్వహించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే రాం రాజగోపాల్, ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, టీడీపీ పొలిట్బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, రాజకీయ ప్రముఖులు పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనకు ముగింపు పలికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సమాజంలో కులాలు, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. 2019లో ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని చూసి ఓర్చుకోలేక జగన్మోహన్ రెడ్డి పిల్లి శాపాలు పెడుతున్నాడన్నారు. అతని శాపాలకు ఇక్కడ భయపడేవాడు ఎవరూ లేరన్నారు.జగన్మోహన్ రెడ్డి 11 కు కూడా పనికిరాని వ్యక్తి. ఇతడిని సింగిల్ డిజిట్ కు తీసుకురావాలి. కూటమి ప్రభుత్వంలో కులాలకు మతాలకు అతీతంగా ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు.

# మల్లికార్జున్ నగర్ లో రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు






**మల్కాజిగిరి :జూన్ 17 :(వార్తా ప్రభ (ప్రతినిధి)** మల్కాజ్ గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ లో గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, సిద్ధి రాములు, రామచెర్ల నర్సింగ్, నాగేష్ గౌడ్, మర్రి శ్రీను, కావలి శ్రీనివాస్, నందు, శంకర్ భాను, సూర్య ప్రకాష్, ఎస్వీఆర్ వెంకట్, చిట్టి బాబు, సంతిపండు శ్రీనివాస్ కపూర్ సురేష్, హబీబ్, రెబ్బ వాసు, వాసు,దత్తు, నరహరి, రాజేష్, సుధాకర్, ప్రేమ్, అశోక్,మల్లేష్, రాజా,భారత్,గణేష్ నాయక్,తిరుపతి,లక్ష్మణ్ చారి,కరీరాజు,విజయ్, మధు ,యాదగిరి,శేషిదార్, భాస్కర్,విఘ్నేశ్ ,సీదులు,దాస్,సోను ,అజీజ్,శ్రీనివాస్,అనిత,లక్ష్మి,లలిత, ఫాతిమా,వరలక్ష్మి శైలేజ,, జ్యోతి,కవితా,సరిత,మౌనిక, సుమతి ,ఉమ పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపో, రైల్వే స్టేషన్‌కు సీఎస్ఆర్ కానుకలు!!

**ప్రయాణికుల సౌకర్యాల కోసం ఎన్టీపీసీ చేయూత**

**సామాజిక బాధ్యతలో మరో ముందడుగు**

**వాటర్ కూలర్లు, బెంచీలతో ప్రజలకు ఉపశమనం**

**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీపీసీ కార్యక్రమాలు**



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం ప్రాంత ప్రజల సౌకర్యాల అభివృద్ధికి ఎన్టీపీసీ రామగుండం మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రజా రవాణా కేంద్రాల్లో ప్రయాణికుల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను అందజేసింది. ఈ మేరకు బుధవారం గోదావరిఖని ఆర్టీసీ డిపోకు స్టెయిన్లెస్ స్టీల్ మూడు సీట్ల బెంచీలు, చల్లని తాగునీటి కోసం వాటర్ కూలర్లను అందించి ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించింది. ఇదే తరహాలో రామగుండం రైల్వే స్టేషన్‌కు నాలుగు స్టెయిన్లెస్ స్టీల్ మూడు సీట్ల బెంచీలు, వాటర్ కూలర్లను అందజేసి రైల్వే ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు సహకరించింది. ప్రజలు ఎక్కువగా వినియోగించే ఈ రెండు కీలక రవాణా కేంద్రాల్లో సౌకర్యాల పెంపుతో వేలాది మంది ప్రయాణికులు లబ్ధి పొందనున్నారు. ప్రయాణికులు వేచి ఉండే సమయంలో సౌకర్యంగా కూర్చునేందుకు, స్వచ్ఛమైన చల్లని తాగునీరు అందుబాటులో ఉండేందుకు ఈ ఏర్పాట్లు ఉపయోగపడనున్నాయి. ఈ సామగ్రి అందజేత కార్యక్రమాల్లో ఎన్టీపీసీ రామగుండం, టీఎస్ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఎన్టీపీసీ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలు వివరాలను సంబంధిత అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాలపై ఎన్టీపీసీ సంస్థ స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంటున్నది. సమాజాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఎన్టీపీసీ రామగుండం నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.

# ఉపాధి హామీ కార్మికుల మధ్యకు కందుల సంధ్యారాణి!!

**ఎండలో శ్రమిస్తున్న కార్మికులకు మజ్జిగ, పండ్ల పంపిణీ**



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**జీడీనగర్, కన్నాల గ్రామాల్లో మండుటెండలను లెక్కచేయకుండా గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కార్మికుల మధ్యకు చేరుకున్న బీజేపీ ఒబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి, మాజీ జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి కార్మికులతో మమేకమయ్యారు. పనిస్థలంలోనే కార్మికుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ వారి సమస్యలను శ్రద్ధగా విన్న నాయకులు, ఎండ తీవ్రత దృష్ట్యా మజ్జిగ, పండ్లు పంపిణీ చేసి మానవతా కోణాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, గ్రామీణ పేదల జీవనోపాధికి ఉపాధి హామీ పథకం బలమైన ఆధారంగా నిలుస్తోందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ కుటుంబాలకు అండగా మారాయని తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, పీఎం కిసాన్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సునీల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం, కార్మికుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర అపారమని, వారి సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో కొమిరె లక్ష్మణ్, కంకటి శ్రీను, మబ్బు సాయి, భీమనపల్లి రామచందర్, తాటిపాముల పవన్, తువ్వ రాజయ్య తదితరులు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు.

# సమిష్టిగా సహకారంతో రాష్ట్ర అభివృద్ధి

**- కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ఎన్టీఆర్ జిల్లా విజయోత్సవ సభలో ఇన్ చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్**






**ఇబ్రహీంపట్నం, జూన్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్ చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ఎన్టీఆర్ జిల్లా విజయోత్సవ సభ గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ లో బుధవారం నిర్వహించారు. జ్యోతి వెలిగించి సభను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందన్నారు. అదేవిధంగా రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు, పరిశ్రమలు నెలకొల్పినట్లు చెప్పారు. ప్రధాని మోదీ 12 సంవత్సరాల అభివృద్ధి, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల వద్దకు వెళ్లి నివేదిక రూపంలో ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు కోసం మళ్లీ కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరనున్నట్లు చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కూల్చివేతలు, కాల్చివేతలు తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాల్జేసి అంధకారంలో నెట్టేశారని ఆరోపించారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ నరేంద్ర మోడీ పాలన నాల్గవ ఆర్థిక శక్తికి తీసుకెళ్లిందన్నారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం విధ్వంసాన్ని అధిగమించిందని తెలిపారు. గూగుల్ ను ఆంధ్రప్రదేశ్ తీసుకువచ్చిన ఘనత మంత్రి నారా లోకేష్ కు దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కులాలు, మతాలు మధ్య గొడ్డలి పార్టీ అధ్యక్షుడు లెవన్ రెడ్డి చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని చూసి ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి పిల్లి శాపాలు పెడుతున్నాడని ఆరోపించారు. ఆయన శాపాలకు ఎవరు భయపడరన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో మైలవరం నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ రూ.5 కోట్లు మంజూరైతే కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో రూ.19.50 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, పొలిట్ బ్యూరో సభ్యుడు పర్ల రామయ్య, తిరువూరు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యేలు కొలికపూడి శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, సీనియర్ నేతలు నాగుల్ మీరా, బుద్దా వెంకన్న, ఫారుఖ్ షుబ్లీ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ చైర్మన్ శావల దేవదత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల రామ్మోహన రావు (గాంధీ), బీజేపీ సీనియర్ నేత నూతులపాటి బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ 100 ఫీట్ల రోడ్డు పనుల్లో తీవ్ర నాణ్యతా లోపాలు..

**● సిపిఐ ఆరోపణ ● స్క్రాప్ (డిస్మెంటల్) మెటీరియల్‌తో రోడ్డు మరమ్మతులు.. తక్షణమే విచారణ జరపాలి..● సిపిఐ మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జ్ తోటపల్లి శంకర్**



**జవహర్ నగర్, జూన్ 17:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ నుంచి చెన్నాపూర్ వెళ్లే 100 ఫీట్ల ప్రధాన రహదారి విస్తరణ, మరమ్మతు పనుల్లో తీవ్ర నాణ్యతా లోపాలు జరిగాయని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటపల్లి శంకర్ తీవ్రంగా ఆరోపించారు. బుధవారం సిపిఐ నాయకత్వ బృందం జవహర్ నగర్ చెన్నాపూర్ ప్రధాన రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా తోటపల్లి శంకర్ మాట్లాడుతూ.. రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే, అలాగే వదిలేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. నెలల తరబడి ఈ పనులను సాగదీయడం వల్ల నిత్యం ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో, సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు ఈ అధ్వానపు రోడ్డు కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**'మునిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా' జవహర్ నగర్ ప్రజల పరిస్థితి:**ఇప్పటికే డంపింగ్ యార్డ్ కాలుష్యంతో నరకయాతన అనుభవిస్తున్న జవహర్ నగర్ ప్రజల పరిస్థితి, "మునిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా" తయారైందని శంకర్ విమర్శించారు. రోడ్డు పనుల ఆలస్యం వల్ల లేస్తున్న దుమ్ము, ధూళితో స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర శ్వాసకోస సమస్యల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి తోడు, ఇతర ప్రాంతాల నుండి తీసుకొచ్చిన డిస్మెంటల్ (పాత రోడ్డు స్క్రాప్) మెటీరియల్‌ను ఇక్కడి రోడ్డు మరమ్మతులకు వాడుతూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించి, నాణ్యమైన మెటీరియల్‌తో యుద్ధప్రాతిపదికన రోడ్డు పనులను పూర్తి చేయాలని, ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటపల్లి శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మిమ్మలి నరసింహులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ అన్వర్, సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి. స్వరూప నాయక్, సిహెచ్. మాధవి, డి. మల్లిక తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత- డా త్రివిక్రమ్ వర్మ



**ఇబ్రహీంపట్నం, జూన్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి):** యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డైరెక్టర్ జనరల్ డా. సి.ఎం. త్రివిక్రమ్ వర్మ తెలిపారు. జూన్ 21న జరగనున్న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడ ఇబ్రహీంపట్నంలోని డా. నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డా. ఎన్‌టిటిపిఎస్)లో రాష్ట్ర ఎస్పీఎఫ్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో "యోగాంధ్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. సి.ఎం. త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది తమ విధుల నిర్వహణలో ఎదుర్కొనే మానసిక, శారీరక ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా పోలీసు సిబ్బంది, తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని ఆయన సూచించారు. యోగా సాధన ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు "ఫిట్ ఆంధ్రప్రదేశ్" లక్ష్య సాధనకు దోహదపడుతుందని అన్నారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి బలమైన పునాదిగా నిలుస్తుందని, రోజువారీ జీవితంలో ఎదురయ్యే అనేక రకాల ఒత్తిళ్ల నుంచి ఉపశమనం కలిగిస్తుందని డా. త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. "యోగాంధ్ర" కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీఎఫ్ డీజీ డా. త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. ఈ "యోగాంధ్ర" కార్యక్రమంలో 350 మందికి పైగా ఎస్పీఎఫ్ పోలీసు సిబ్బంది మరియు ఇతరులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలను అభ్యసించారు. ఎస్పీఎఫ్ జోనల్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు, డా. ఎన్‌టిటిపిఎస్ (ఇబ్రహీంపట్నం) అసిస్టెంట్ కమాండెంట్ టి. కృష్ణమాచారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.వి. రామిరెడ్డి, డా. ఎన్‌టిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ శివ రమణాంజనేయులు, ఏపీ సచివాలయ ప్రధాన భద్రతాధికారి పి.వి.ఎస్.ఎన్. మల్లికార్జునరావు, ఏపీ హైకోర్టు అసిస్టెంట్ కమాండెంట్ కె. శ్రీనివాసులు, విజయవాడ--గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం అసిస్టెంట్ కమాండెంట్ టి.కె. రావు, విజయవాడ గార్డ్స్ అసిస్టెంట్ కమాండెంట్ పి. హేమసుందరరావు, యోగా గురువు లంకె జనార్ధన్, వివిధ ఇన్‌స్పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు.

**ఏనుగు నర్సింహా రెడ్డి సాంస్కృతిక శాఖ డైరెక్టర్**



**జవహర్ నగర్, జూన్ 17:(వార్తా ప్రభ)**తెలంగాణ భాష సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసినందుకు భాష సంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి ఐఏఎస్ ని తెలంగాణ భాష సంస్కృతిక శాఖ సహా మండలి సభ్యుడు పల్లె నరసింహ తో కలిసి కళాకారుల బృందం తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు రవీంద్రభారతిలో కలిసి డైరెక్టర్ కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం రోజు నుంచి గుర్తింపు కార్డుల జారీ చేసే కార్యక్రమం ప్రారంభమైందని కళాకారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి కళాకారునికి గుర్తింపు కార్డు ఇచ్చే విధంగా ప్రక్రియ కొనసాగుతుందని సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి కళాకారులకు తెలిపారు. ప్రతి కళాకారునికి ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇస్తుందని ఎవరు కూడా ఆందోళన చెందొద్దని కళాకారులను తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలిమేడ్చల్ జిల్లా కార్యదర్శి వెంకటాచారి, అధ్యక్షురాలు ప్రమీల, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ , హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాల నలిని కార్యదర్శి పి. సైదులు, రంగారెడ్డి జిల్లా జిల్లా అధ్యక్షులు కూన సుధాకర్, జిల్లా సహాయ కార్యదర్శి ముచ్చపోతుల రాములు, కళాకారులు వనం అడివయ్యా, రామస్వామి, అరుణ్, కుమార్, జోసెఫ్, భాను, కళాకారులు,తదితరలు పాల్గొన్నారు.

# ప్రయాణికుల సేవలే ప్రాధాన్యం

**సమయపాలన, నాణ్యమైన సేవలే లక్ష్యం**

**ఆర్టీసీపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచుతాం**

**డిపో మేనేజర్ చల్ల కవితా రెడ్డి**

**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖని ఆర్టీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డిపో మేనేజర్ చల్ల కవితా రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు మరింత నాణ్యమైన, సురక్షితమైన మరియు సమయపాలనతో కూడిన సేవలు అందించడమే ఆర్టీసీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సుల నిర్వహణ, ప్రత్యేక సర్వీసుల ఏర్పాటు, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. వేసవి సెలవులు, పండుగలు, విద్యాసంస్థల ప్రారంభ సమయాల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులను నడుపుతున్నామని వెల్లడించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం సురక్షితమే కాకుండా ఆర్థికంగా కూడా ప్రయోజనకరమని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, వృద్ధులు ప్రభుత్వ పథకాల ద్వారా అధికంగా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని నిరంతరం సూచనలు ఇస్తున్నామని వివరించారు. ప్రజలు ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ సేవలను ఎక్కువగా వినియోగించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిపోకు సంబంధించిన పలు అంశాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం!!

**స్కూల్ బస్సులపై పోలీసుల ప్రత్యేక దృష్టి**

**డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు- ఏసీపీ రమేష్**



**ఎద్దపల్లి/గోదావరిఖని: జూన్ 17 (వార్తాప్రభ ప్రతినిధి)**పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ స్పష్టం చేశారు. గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లకు బుధవారం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల రవాణాలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నైపుణ్యం, అనుభవం కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని, విద్యార్థులను ఎక్కించే, దించే సమయంలో నిర్ణీత ప్రదేశాల్లోనే బస్సులను నిలిపివేయాలని పేర్కొన్నారు. అతివేగం, ప్రమాదకర ఓవర్‌టేకింగ్‌లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డ్రైవర్ల నిర్లక్ష్యానికి సంబంధించి స్కూల్ యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణకుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ రెడ్డి, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్, రామగుండం ఎస్సై సంధ్యారాణి, రామగిరి ఎస్సై శ్రీనివాస్, ముత్తారం ఎస్సై రవికుమార్‌తో పాటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# రైతుల భూములను ల్యాండ్ పుల్లింగ్ లో స్థలం కేటాయించండి...

**మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రష్ యాదవ్.**



**కీసర, జూన్ 17:(వార్తా ప్రభ)**నాగారం డివిజన్ రాంపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 388 లో ఎస్సీ బీసీ రైతులు గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని ఆ రైతులకు ల్యాండ్ పుల్లింగ్ కింద స్థలాన్ని కేటాయించాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, రైతులు బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 388 లో 38 ఎకరాల విస్తీర్ణం లో సుమారు 270 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు, వరి, కూరగాయల పంటలను రైతు లు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని అదనపు కలెక్టర్ కు వివరించారు. ఆ పొలంలో తాతల తండ్రుల కాలం నుంచి వ్యవసాయం చే సుకుంటూ రైతులు బతుకుతున్నారని వివరించారు. రైతులకు న్యాయం చేసి ల్యాండ్ పుల్లింగ్ కింద స్థలాన్ని కేటాయించాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయం చేసుకుంటున్న పొలాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

# ప్రజల భద్రతే ప్రథమం - నంబర్ లేని వాహనాలకు అడ్డుకట్ట వేయాలి



**జగ్గయ్యపేట జూన్ 17 (వార్త ప్రభ)**నియోజకవర్గంలో నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న భారీ వాహనాలు ప్రజల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారాయి. ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలను గుర్తించడం కష్టమవుతోంది. సంబంధిత అధికారులు వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నంబర్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే చిన్న వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు మరియు ఆటో డ్రైవర్లు, తమ అవసరాల కోసం దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్ల పరిస్థితులు, ట్రాఫిక్ సమస్యలు మరియు భద్రతా అంశాల కారణంగా వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరియు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని చిన్న వాహనదారులు కోరుతున్నాము. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని నంబర్ లేని వాహనాల నియంత్రణ, రోడ్డు భద్రత మెరుగుదల మరియు చిన్న వాహనదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

## కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు



**తిరువూరు,జూన్ 17 (వార్తాప్రభ) :** తిరువూరు ఏలూరు సీనియర్ న్యాయవాది ఇడుపుగంటి శ్రీనివాస్ బాబు ఇంటి మీద జరిగిన అక్రమ దాడి మరియు పోలీసుల అక్రమ నిర్బంధమును నిరసిస్తూ ఈ రోజు కోర్ట్ విదులనుబహిస్కరించి న్యాయవాదుల మీదదాడిని ఖండిస్తూ వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంకురాత్రి జనార్దన రావు అధ్యక్షులు , గోగిరెడ్డి కృష్ణా రెడ్డి జనరల్ సెక్రటరీ సీనియర్ న్యాయ వాదులు మాకారాజు రమా మోహన రాజు మోదుగుమూడి శ్రీనివాసరావు మేకల నాగేంద్ర ప్రసాద్ మర్శకట్ల కుమార్ అంకిరెడ్డి అంజన రెడ్డి ఇనుగంటి మురహరి రావు నాగుబండి రమేష్ నాగుబండి రామ కృష్ణ చింత ల వెంకట రెడ్డి మేకల రవి. గుండాల భాస్కర్ కారుమంచి సునీల్ తదితరులు పాల్గొన్నారు

## అగ్నిమాపక సిబ్బంది సమయోచిత చర్యల వల్ల ప్రాణాపాయం తప్పిన ఆవు దూడ..!



**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** పట్టణంలోని శాంతినగర్ మాంటిసోరి స్కూల్ సమీపంలో ఓ ఆవు దూడ ప్రమాదవశాత్తు డ్రైనేజీ కాలువలో పడిపోయింది. కాలువలో చిక్కుకుపోయిన దూడ పైకి ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉండగా, అక్కడ నివసించే గృహిణి శ్రీమతి జై పద్మావతి ఈ విషయాన్ని గుర్తించి వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమా పక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, చాకచక్యంగా సహాయక చర్యలు చేపట్టారు. ఎంతో శ్రమించి డ్రైనేజీలో చిక్కుకున్న ఆవు దూడను సురక్షితంగా బయటకు తీసి ప్రాణాలతో రక్షించారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బంది తక్షణ స్పందనను అభినందించగా, జై పద్మావతి చూపిన మానవతా దృక్పథాన్ని ప్రశంసించారు. అగ్నిమాపక సిబ్బంది సమయోచిత చర్యల వల్ల ఆవు దూడకు ప్రాణాపాయం తప్పింది.

## విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ..



**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** స్థానిక పిన్నమనేని నగర్ & బాలకృష్ణ నగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు మహాత్మా పూలే వాకర్స్ క్లబ్ కార్యదర్శి కుంభం నాగమ–ణి ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 204 గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు ముఖ్య అతిధిగా ఉచిత నోట్స్ బుక్స్ పంపిణి నిర్వహించారు. దాత మట్టుపల్లి బలరాం కుమార్తె దినకరి వితరణ తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన క్లబ్ కార్యదర్శి కుంభం నాగమణి, అధ్యక్షురాలు దారం నాగరాణి, కోశాధికారి బోనం గోపిక లను అభినందిస్తూ.. మహాత్మా పూలే వాకర్స్ ఈ సం॥ ము లో వాకర్స్ ఇంటర్నేషనల్ చార్టర్ నం. 1700 తో ప్రారంభించి, అనేక సేవా కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించడం సంతోషం అన్నారు. వేసవిలో నిత్యం ఉచితంగా మజ్జిగ పంపిణి, వడనివారణ మందులు, మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఇప్పుడు విద్యార్థులకు బుక్స్, బ్యాగ్స్ పంపిణి చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వీరమాచనేని శైలజ, దినకరి, స్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష అభ్యర్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం

**కాకినాడ, జూన్ 17 (వార్తాప్రభ) :** ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నీట్ (చీజుజు) పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంయువి మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా పరిధిలోని కాకినాడ, తుని డిపో బస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ ను చూపించి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్ స్టేషన్లలో సహాయక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి కోరారు.

## లోకేష్ ను విమర్శించే స్థాయి కన్నబాబుకి లేదు:ఎమ్మెల్సీ పేరాబత్తుల



**కాకినాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** మాజీ మంత్రి కురసాల కన్నబాబు డీఎస్సీ ప్రక్రియపై చేసిన వ్యాఖ్యలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర మంత్రి లోకేష్ ని విమర్శించే నైతిక హక్కు, స్థాయి కన్నబాబుకు లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను, నిరుద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. డీఎస్సీపై ఏవైనా అనుమానాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని సాక్షాత్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మీ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి కి సవాల్ విసిరారని, దమ్ముంటే ముందు ఆ సవాల్‌ను స్వీకరించి చర్చకు రావాలని డిమాండ్ చేశారు. తప్పులు వెతుకుతూ కాలయాపన చేయడం మాని, ధైర్యం ఉంటే మీ నాయకుడిని డీఎస్సీపై చర్చకు పంపాలని ఎమ్మెల్సీ కన్నబాబుకు సవాల్ విసిరారు.

# ప్రజల సంతోషం కోసమే కూటమి ప్రభుత్వ కృషి : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

- గుడివాడలో 31 కుటుంబాలకు రూ. 30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ ..

2 ఏళ్లలో రూ. 6.36 కోట్ల సహాయం - కూటమి ప్రభుత్వ రికార్డు





**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంతోషం కోసమే పనిచేస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉద్ఘాటించారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక కార్యాలయంలో బుధవారం ఉదయం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో కూటమి నాయకుల సమక్షంలో నియోజకవర్గ పరిధిలోని 31 బాధిత కుటుంబాలకు రూ. 30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ నేడు రూ. 30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇవ్వగా, కూటమి రెండేళ్లలో గుడివాడ నియోజకవర్గంలోనే రూ. 6 కోట్ల 36 లక్షల చెక్కులు అందించామన్నారు. ప్రతిపక్ష వైసిపి అధికారంలో ఉన్న 5 ఏళ్లలో ఎంత ఇచ్చారో వాస్తవ రికార్డులను వెలికి తీస్తే నిజాలు తెలుస్తాయని అన్నారు. వైసిపి వాళ్లు చాలా సులువుగా అబద్ధాలు చెబుతున్నారనీ విమర్శించారు. మేము ఎంత ఇచ్చామో ప్రజల ముందు చెబుతున్నామని, మీ హయాంలో ఎంత ఇచ్చారో ఆధారాలతో ప్రజల ముందు ఉంచాలని సవాల్ చేశారు. ప్రజలకు అవసరమైన విషయాల్లో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడే ప్రసక్తి లేదనీ ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ డబ్ల్యూ సి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి, గుడివాడ, రూరల్, నందివాడ , గుడ్లవల్లేరు మండలాల టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబయ్య, వాసే మురళి, దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకట్రావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, మిక్కిలినేని రమేష్, దారపురెడ్డి మణిశ్వరావు, రెడ్డి షణ్ముఖ, అంగుళూరు శ్యామలరావు, అంజిరెడ్డి, ఉబ్బల వెంకటేశ్వరరావు, నవాబు, మాదాసు ప్రసాద్, జనసేన ఉపాధ్యక్షుడు వేమూరి త్రినాథ్ పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గుడివాడ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో ఆసుపత్రులలో అగ్ని భద్రతా అవగాహన కార్యక్రమం





**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** స్థానిక అగ్నిమాపక కేంద్రం పరిధిలో మంగళవారం పామర్రు రోడ్డులోని రాణా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, లయన్స్ క్లబ్ కంటి హాస్పిటల్లో అగ్ని ప్రమాదాలపై విస్తృత అవగాహన కార్యక్రమం మరియు మాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యుత్ వినియోగం అధికంగా పెరగడంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ముఖ్యంగా ఆసుపత్రుల వంటి సున్నితమైన ప్రదేశాలలో ఇవి తీవ్రమైన ప్రాణనష్టానికి దారితీయవచ్చని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో హాస్పిటల్ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పాటు భద్రతా విధానాలపై సమగ్ర శిక్షణ అందించారు.

**పేషెంట్ల భద్రతకు అగ్రప్రాధాన్యత :** అగ్నిప్రమాదం సంభవించిన సందర్భంలో పేషెంట్లను భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని సిబ్బందికి వివరించారు. ముఖ్యంగా ఐసియులో చికిత్స పొందుతున్న రోగులు, వృద్ధులు మరియు అత్యవసర చికిత్సలో ఉన్న వారిని అన్నింటికంటే ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. పేషెంట్లను తరలించే క్రమంలో గందరగోళం నెలకొనకుండా ముందుగానే స్పష్టమైన ఎగ్జిట్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు.

**పొగ నుండి రక్షణ - కీలక సూచనలు :** అగ్నిప్రమాదాల సమయంలో మంటల కంటే పొగ వల్లనే అధిక ప్రాణనష్టం సంభవిస్తుందని అధికారులు తెలిపారు. పొగ అధికంగా వ్యాపించిన ప్రాంతాల్లో తడిచేసిన గుడ్డతో ముక్కు, నోరు మూసుకుని శరీరాన్ని కిందికి వంచుకుని సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్ల ద్వారా మాత్రమే నిష్క్రమించాలని స్పష్టం చేశారు.

**ఆచరణాత్మక శిక్షణ - మాక్ డ్రిల్ :** ఈ కార్యక్రమంలో భాగంగా ఫైర్ ఎక్స్టింగ్విషర్లు మరియు ఫైర్ హైడ్రెంట్ల వినియోగంపై సిబ్బందికి ప్రత్యక్ష శిక్షణ అందించారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాల వినియోగాన్ని మాక్ డ్రిల్ ద్వారా ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. ల్యాబ్లు మరియు ఐసియు విభాగాల్లో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉంటాయని, వాటిని ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని వివరించారు.

**విద్యుత్ భద్రత - తప్పనిసరి జాగ్రత్తలు :** హాస్పిటల్లో ఏసీలు, జనరేటర్లు మరియు విద్యుత్ వైరింగ్‌ను క్రమం తప్పకుండా నిపుణులచే తనిఖీ చేయించాలని అధికారులు సూచించారు. ఎలక్ట్రికల్ ఫైర్ సంభవించిన సందర్భంలో నీటిని ఉపయోగించకుండా డ్రై పౌడర్ ఎక్స్టింగ్విషర్ మాత్రమే వినియోగించాలని హెచ్చరించారు. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే 101 టోల్ ఫ్రీ నంబర్ లేదా 08674-242299 కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి జీ. ఆంజనేయులు, అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి





**అవనిగడ్డ,జూన్ 17 (వార్తాప్రభ) :** భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం, జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)--2026 ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం ఆయన అవనిగడ్డ మండలంలోని వైశ్య కాలనీ, అశ్వరావుపాలెం గ్రామాలను సందర్శించి బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓలు) పనితీరును పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఏ విధంగా నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. తొలుత వైశ్య కాలనీలోని వి. రామ్మోహనరావు నివాసాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ బీఎల్ఓ ద్వారా సర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. తన పరిధిలోని ఓటర్లందరికీ ఎన్నికల గణన ఫారాలను పంపిణీ చేసినట్లు బీఎల్ఓ వివరించారు. గ్రామంలో అందుబాటులో లేని ఓటర్లకు వారి కుటుంబ సభ్యులు లేదా స్థానికుల ద్వారా సమాచారం అందించి ఫారాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. అనంతరం అశ్వరావుపాలెం గ్రామంలోని కొండవీటి కృష్ణకుమారి నివాసాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, బీఎల్ఓ ఐనంపూడి శుభవాణి ద్వారా పురోగతిని తెలుసుకున్నారు. గ్రామంలో నమోదైన 829 మంది ఓటర్లలో 828 మందికి గణన ఫారాలు పంపిణీ చేశామని, ఒకరు మరణించడంతో ఫారం పంపిణీ చేయలేదని ఆమె వివరించారు. ఓటర్ల నుంచి తిరిగి స్వీకరించిన గణన ఫారాలను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను ఏదైనా ఒకటి చేసి చూపించాలని సిబ్బందిని అడుగగారు. వారు కొండవీటి కృష్ణకుమారికి చెందిన గణన ఫారాన్ని చేసి చూపించగా, ప్రక్రియపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

**బీఎల్ఓ శుభవాణికి కలెక్టర్ ప్రత్యేక ప్రశంసలు..** అశ్వరావుపాలెం గ్రామంలో సర్--2026 కార్యక్రమాన్ని సమర్థవంతంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్న బీఎల్ఓ ఐనంపూడి శుభవాణిని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె సేవలను గుర్తిస్తూ కలంకారి ఉత్పత్తులను బహుమతిగా అందజేశారు. ఇతర బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది కూడా ఆమెను ఆదర్శంగా తీసుకుని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన అంశమని, ఏ ఒక్క అర్హత గల ఓటరు కూడా జాబితా నుండి తొలగిపోకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు, మండల తహసిల్దార్ బి అంకాలు, బిఎల్ఓ లు, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు స్వీకారణ

**మైలవరం,జూన్ 17 (వార్తాప్రభ) :** స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్,కామర్స్ సబ్జెక్టులను బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి బుధవారం ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ బోధనకు ఎం.ఎస్సీ. కంప్యూటర్ సైన్స్ లేదా ఎంసీఏ విద్యార్హత, కామర్స్ బోధనకు ఎం.కామ్. లేదా ఎంబీఏ విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత పీజీ కోర్సుల్లో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలియజేశారు.
అదనంగా నెట్ (NET), సెట్ (SET) లేదా పీహెచ్.డి. (Ph.D.) అర్హతలు కలిగిన అభ్యర్థుల కు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల నకలు కాపీలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల అనగా జూన్ 25వ తేదీ లోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు.మరిన్ని వివరాలకు 08659-299992 నంబరులో సంప్రదించవచ్చని తెలియజేశారు.

## చంద్రగూడెంలో రైతులకు వరి విత్తనాలు పంపిణి



**మైలవరం(చంద్రగూడెం),జూన్ 17 (వార్తాప్రభ) :** మైలవరం మండలం చంద్రగూడెం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో చంద్రగూడెం సొసైటీ చైర్మన్ మోర్ల వెంకటరోశాలు రైతులకు బుధవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు కడియం బాలరాజు,యూనిట్ ఇంచార్జ్ రాయుడు శ్రీనివాసరావు,బూత్ ఇంచార్జ్ తాత శ్రీనివాసరావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లెపాలెం హై స్కూల్ విద్యార్థులకు యూనిఫామ్ అందజేత...



**కృత్తివెన్ను,జూన్ 17 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లెపాలెం నందుబుధవారం విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల లో విద్యార్థులందరికీ గ్రామ పెద్దలు, విద్యా కమిటీ సభ్యులు హాజరై యూనిఫామ్ అందించారు. ఈ కార్య క్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు టీవీవీ ప్రసాద్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్య ప్రకాష్,మోకా రామకృష్ణ,నాగిడి చెన్నకేశవరావు,బొడ్డు యేసుబాబు, కొల్లాటి వెంకన్న,మోకా సత్యనారాయణ,తిరుమలశెట్టి రమేష్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్. పై డోర్ టు డోర్ పామ్స్ అందజేత



**పెనుగంచిప్రోలు, జూన్ 17 (వార్తాప్రభ) :** ఎస్.ఐ.ఆర్. పై బుధవారం 180 వ బూత్ లో డోర్ టు డోర్ కార్యక్రమంలో ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ మహబూబ్ జానీ, క్లస్టర్ ఇంచార్జ్ చుంచు రమేష్ బాబు, నూతలపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

## నూతన దంపతులను ఆశీర్వదించిన వై.ఎస్.ఆర్. నేతలు దేవినేని,తన్నీరు లు




**పెనుగంచిప్రోలు, జూన్ 17 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట గ్రామానికి చెందిన కలక రాయప్ప–రోజాన కుమారుడు సంజయ్ థామస్ వివాహ వేడుకకు ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ తో కలిసి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్–ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మరియు వైఎస్ఆర్ సీపీ నాయకులు నూతన దంపతులను ఆశీర్వదించారు.

## తీరగ్రామాలకు ట్యాంకరుతో త్రాగునీరు సరఫరా



**కోడూరు,జూన్ 17 (వార్తాప్రభ) :** కోడూరు మండలంలోని తీర గ్రామాలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచన మేరకు కోడూరు టౌన్ జనసేన పార్టీ అధ్యక్షులు కోట రాంబాబు వాటర్ ట్యాంకరుతో త్రాగునీరు సరఫరా చేశారు. బుధవారం మండల పరిధిలోని పాలకాయతిప్ప, హంసలదీవి గ్రామాలకు వాటర్ ట్యాంకరుతో త్రాగునీరు సరఫరా చేశారు. రెండు గ్రామాలకు ఎనిమిది వేల లీటర్ల త్రాగునీరు అందచేశారు.

## గుడివాడ అమర్‌నాథ్ క్షమాపణ చెప్పాలి: వంగలపూడి అనిత

**విజయవాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నేత గుడివాడ అమర్ నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యల దుమారం ఏపీ రాజకీయాల్లో మరింత ముదిరింది. ఈ వ్యవహారంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా అత్యంత తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలు యాదృచ్ఛికంగా చేసినవి కావని, వైసీపీ ఐదేళ్ల విఫల పాలనలో పెంచి పోషించిన విషపూరిత రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో శాంతిభద్రతలు, అభివృద్ధిపై మాట్లాడటానికి ఆ పార్టీ నేతల వద్ద ఎలాంటి సమాధానాలు లేవని లోకేశ్ ఎద్దేవా చేశారు. హోంమంత్రి పదవిలో ఉన్న ఒక మహిళను, అందులోనూ ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకురాలిని పనిగట్టుకుని లక్ష్యంగా చేసుకోవడం వెనుక వైసీపీ వికృత రాజకీయం దాగి ఉందన్నారు.

# మెరిసిన ప్రతిభ - పతకాల పంట

## జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కనాలిని అద్భుతం






**విజయవాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** ఈ జాతీయ స్థాయి పోటీలలో ఎస్-10 విభాగంలో అత్యంత ప్రతిభను కనబరిచిన కనాలిని రెండు పతకాలను తన ఖాతాలో వేసుకున్నారు. 50 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో శరవేగంగా ఈదుతూ రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. 100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో గట్టి పోటీని ఎదుర్కొని కాంస్య పతకాన్ని సాధించారు.

**అంతర్జాతీయ వరల్డ్ కప్‌కు ఎంపిక..** ఈ జాతీయ పోటీలలో నిర్ణీత అర్హత సమయాన్ని విజయవంతంగా నమోదు చేయడం ద్వారా రాబోయే ప్రతిష్టాత్మక పారా స్విమ్మింగ్ వరల్డ్ కప్ సిరీస్ పోటీలకు కనాలిని అధికారికంగా ఎంపికయ్యారు. ఈ అంతర్జాతీయ టోర్నమెంట్‌కు సంబంధించిన వేదికలను అంతర్జాతీయ పారా ఒలింపిక్ కమిటీ త్వరలోనే ఖరారు చేయనుంది. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో రాణించి, అంతర్జాతీయ వేదికపై భారతదేశం తరపున పోటీ పడే అర్హత సాధించిన కనాలినిను పలువురు ఉన్నతాధికారులు, క్రీడా ప్రముఖులు అభినందించారు.

### రాష్ట్రపతి అవార్డు గ్రహీత శిక్షణలో... 'టెన్జింగ్ నార్గే' అవార్డు గ్రహీత తులసి చైతన్య శిక్షణలో పారా స్విమ్మింగ్ వరల్డ్ కప్‌కు ఎంపిక!

రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక 'టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు' అందుకున్న అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్, ఆంధ్రప్రదేశ్ పోలీస్ కోచ్ ముత్తుకూరి తులసి చైతన్య వద్ద కనాలిని ప్రత్యేక శిక్షణ పొందారు. కోచ్ అందించిన మెళకువలు, ప్రోత్సాహంతోనే జాతీయ స్థాయిలో ఈ ఘనత సాధించినట్లు క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. ఎస్. సెంథిల్ కుమార్, విజయరాణి దంపతుల కుమార్తె కుమారి వి. కనాలిని పారా స్విమ్మింగ్ రంగంలో అద్భుత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ వేదికకు ఎంపికయ్యారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో గల 'జీ స్విమ్ అకాడమీ'లో నిర్వహించిన 26వ జూనియర్, సబ్-జూనియర్ జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆమె ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించారు.



# ఎక్మోతో ఊపిరితిత్తుల చికిత్సలో సరికొత్త విప్లవం!

- చివరిదశ ఊపిరితిత్తుల వైఫల్యానికి అత్యంత అధునాతన వైద్యం అందుబాటులోకి..
- యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ వెల్లడి



**విజయవాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో, ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో 'ఎక్మో' (కృత్రిమ గుండె-ఊపిరితిత్తుల పరికరం) విధానం ఒక సంజీవనిలా మారుతోందని హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ తెలిపారు. బుధవారం విజయవాడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేఖరుల సమావేశంలో ఆమె ఈ అత్యంత సంక్లిష్టమైన వైద్య విధానం యొక్క విశిష్టతను మరియు మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సదుపాయాలు ఏ విధంగా అందుబాటులోకి వచ్చాయో వివరించడానికి, చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల్లో భరోసా నింపడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రాణం నిలిపే 'ఎక్మో' (కృత్రిమ శ్వాస వ్యవస్థ) విధానం: చివరి దశ 'ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్' లేదా శ్వాసకోశ వైఫల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్‌ను అందించే సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు ఈ 'వెనో-వీనస్ ఎక్మో' లైఫ్ సపోర్ట్ విధానాన్ని ఉపయోగిస్తామని. ఈ విధానంలో అత్యాధునిక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుంది. ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి, దానికి పూర్తి ఆక్సిజన్‌ను అందించి, కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతుంది. ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు, దాత దొరికేవరకు ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైనదని డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ వివరించారు. సెకన్ల సమన్వయంతో సాగే అవయవ మార్పిడి: ఈ ఎక్మో విధానంలో ఉన్న రోగులకు ఊపిరితిత్తుల మార్పిడి చేయడం వైద్యశాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. రక్తం గడ్డకట్టడం, అధిక రక్తస్రావం వంటి తీవ్రమైన సాంకేతిక ప్రమాదాలను అధిగమిస్తూ.. గుండె-ఊపిరితిత్తుల నిపుణులు, అనస్థీషియా వైద్యులు, ఐసీయూ నర్సింగ్ బృందం సెకన్ల సమన్వయంతో వ్యవహరించి ఈ సుదీర్ఘ శస్త్రచికిత్స ప్రక్రియను విజయవంతం చేయాల్సి ఉంటుందని. ఊపిరితిత్తుల వ్యాధి చివరి దశకు చేరినంత మాత్రాన ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఎక్మో వంటి అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన వైద్య విధానం ద్వారా ప్రాణాలు నిలపడం సాధ్యమేనని స్పష్టం చేశారు.

**విజయవంతమైన రికవరీ విధానం..** శస్త్రచికిత్స అనంతరం అందించే ప్రత్యేక అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రోటోకాల్స్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం మరియు వెంటిలేటర్ల నుండి సురక్షితంగా తొలగించి, కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా చేస్తామని. ఆ తర్వాత క్రియాశీల శారీరక వ్యాయామాల ప్రక్రియ (రిహాబిలిటేషన్) ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్సా విధానం తోడ్పడుతుందని డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ వివరించారు. ఈ విలేఖరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ విభాగం ఏజీఎం వెంకటేశ్వరరావు వీరంకి, మేనేజర్ రెంటాలా విజయ్ కుమార్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిలకమర్తి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..



**కృత్తివెన్ను,జూన్ 17 (వార్తాప్రభ) :** మహాకవి కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లిపాలెం నందు బుధవారం ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీవీ ప్రసాదరావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఈయన తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటలో జన్మించారని 5వ ఏటనే మసూచి వ్యాధి వల్ల రెండు కళ్ళు కోల్పోయిన ధైర్యం కోల్పో లేదని, గురువుల దగ్గర శ్రద్ధగా విని ,సంస్కృతం తెలుగు ,ఇంగ్లీష్ ,హిందీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించారని ఆయన జ్ఞాపకశక్తి అమోఘమని అన్నారు.తెలుగులో ఆధునిక నాటక ప్రక్రియకు రూపుదిద్దె ఆంధ్ర నాటక పితామహుడిగా కీర్తిగెక్కారు .ఈయన రచించిన నాటకాలలో గయోపాఖ్యానం, ప్రసన్న యాదవశీ , కీచక వధ పారిజాతాపహరణం వంటి 30 పైగా నాటకాలు వ్రాసి అభినవ కాళిదాసు అనే బిరుదును పొందారు .ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు శిష్యుడు .ఆయన భావాల ప్రభావంతో బాల్యవివాహాలు, వరకట్నం ,వితంతు సమస్య లాంటి దురాచారాలను తన నాటకాల ద్వారా ఎండగట్టారు. శ్రీ విద్య కోసం గట్టిగా పోరాటం చేశారని సూర్య ప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ప్రభ ,త్రివేణి, రేఖ ,దుర్గా ,జ్యోతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్య రహిత గ్రామంగా దుగ్గిరాలపాడు

## -గ్రామస్తులకు అవగాహన కల్పించిన ఎస్సై సతీష్ కుమార్




**జి.కొండూరు(దుగ్గిరాలపాడు,జూన్ 17 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండల పరిధిలోని గుర్రాజుపాలెం గ్రామాన్ని మాదక దవ్య రహిత గ్రామంగా ఎస్సై కె.సతీష్ కుమార్ అధికారికంగా ప్రకటించారు. మంగళవారం రాత్రి దుగ్గిరాలపాడు గ్రామంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు.డ్రగ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలు, ఆరోగ్యంపై దుష్ప్రభావాలు, యువతపై చూపే ప్రభావం గురించి గ్రామస్తులకు వివరంగా అవగాహన కల్పించారు.డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీసులు చేపడుతున్న "డ్రగ్స్ పై దండయాత్ర" కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, అనుమానిత గంజాయి వాహకులపై తనిఖీలు నిర్వహించి, గంజాయి సరఫరాదారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నామని తెలిపారు. గ్రామస్తులకు మరింత స్పష్టత కోసం ప్రొజెక్టర్ ద్వారా గంజాయి అనర్థాలపై అవగాహన వీడియోలు ప్రదర్శించా రు.అలాగే ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల గురించి కూడా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, ఫేక్ లింకులు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలు, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషయాలపై ప్రొజెక్టర్ ద్వారా సైబర్ నేరాల అవగాహన వీడియోలు ప్రదర్శించడం ద్వారా గ్రామస్తులకు అర్థమయ్యేలా వివరించారు. ఎటువంటి సైబర్ మోసం జరిగినా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. డ్రగ్స్ సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, గ్రామాన్ని డ్రగ్స్ రహితంగా కొనసాగించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి సైబర్ మోసం జరిగినా వెంటనే 1930 హెల్ప్‌లైన్ కు సమాచారం ఇవ్వాలని తెలియజే శారు.ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు,యువకు లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాడి రైతులకు మెయిల్ క్రిష్ణారెడ్డి ఆర్థిక సహకారం...




**గుడ్లవల్లేరు,జూన్ 17 (వార్తాప్రభ) :** మండలంలోని వివిధ గ్రామాల్లో పేదరికంలో ఉండే పాడి రైతులు ఆర్థిక స్వావలంబన సాధించుకునేందుకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ఆర్థిక సహకారం అందిస్తున్నారని ఆ సంస్థ ప్రతినిధులు బి.చింతయ్య, పి.రఘురామ్ పేర్కొన్నారు. పేద కుటుంబాలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు పీ4(పబ్లిక్--ప్రై వేట్--పీపుల్--పార్టనర్‌షిప్) ప్రాజెక్టులో భాగంగా గాదేపూడిలో రావి విజయలక్ష్మి అనే మహిళా పాడి రైతు కుటుంబానికి రూ.70వేల విలువ గల పాడి గేదెను జీవనోపాధి సహాయంగా అందించారు. మెయిల్ క్రిష్ణారెడ్డి అందించిన ఈ సహాయం వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించడమే కాకుండా స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలిచిందని ఆ గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత...



**గుడ్లవల్లేరు,జూన్ 17 (వార్తాప్రభ) :** కేవలం బంగారు కుటుంబాలకు ఆర్థిక స్వావలంబనకు ఆర్థిక చేయూతను ఇవ్వటమే కాకుండా పర్యావరణ పరిక్షణ ప్రజలందరి బాధ్యతగా గుర్తు చేసేందుకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండలంలోని విన్నకోట గ్రామ పంచాయితి కార్యాలయంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సమావేశానికి బంగారు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా కుటుంబాల వారు నివశించే వీధుల్లోని రోడ్లు, మంచినీటి సమస్యలు ఆ సమావేశంలో తెలియపరిచారు.అలాగే పీ4 ద్వారా బంగారు కుటుంబాలకు జీవనోపాధి అందించుట, స్కిల్ ట్రైనింగ్ ల గురించి మరొక సారి బంగారు కుటుంబాలకు తెలియజేశారు. కొత్తగా జీవనోపాధి పొందే బంగారు కుటుంబ సభ్యుల పేర్లు సభలో తెలియజేశారు. దీనిపై గ్రామ కార్యదర్శి డి.ఫణిదీప్, గ్రామ పెద్దల అంగీకార తీర్మానం పొందారు. పీ4 ప్రాజెక్ట్ మేనేజర్ బి.చింతయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.రఘురామ్, బంగారు కుటుంబాల సభ్యులు, బంగారు మిత్రలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# పెడనలో కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభ....

- అభివృద్ధికి బాటలు వేసాము.. కాగిత






**పెడన,జూన్ 17 (వార్తాప్రభ) :** స్థానిక తోటమూల కళ్యాణ మండపంలో నిర్వహించిన "కూటమి ప్రభుత్వం 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" విజయోత్సవ సభలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ యువ మంత్రివర్యులు నారా లోకేష్ సారథ్యంలో మన ఆంధ్రప్రదేశ్ కేవలం రెండేళ్లలోనే విధ్వంసం నుంచి వికాసం వైపుగా దిగ్విజయవంతంగా అడుగులు వేస్తోంది.. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఒక ప్రజాప్రతినిధిగా మీరందరూ నాపై ఉంచిన నమ్మకానికి, బాధ్యతకు పూర్తి న్యాయం చేస్తూ... నియోజకవర్గ ప్రగతి సాధనే ఏకైక లక్ష్యంగా మన ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.అభివృద్ధి అనేది కేవలం కొన్ని ప్రాంతాలకో లేదా కొన్ని వర్గాలకో పరిమితం కాకుండా, నియోజకవర్గంలోని ప్రతి పల్లెకూ, ప్రతి ఇంటికీ చేరాలనే సంకల్పంతో మేము పనిచేస్తున్నామన్నారు. మన నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పన మరియు మాజిక భద్రతను బలోపేతం చేస్తూ కూటమి ప్రభుత్వం అక్షరాలా 1,176 కోట్ల 57 లక్షల రూపాయల నిధులను విడుదల చేసి రికార్డు స్థాయి వ్యయంతో నియోజకవర్గ రూపురేఖలను మార్చమన్నారు.. ఈ నివేదిక కేవలం ఒక మైలురాయి మాత్రమే. ఇక్కడితో మన ప్రగతి ప్రస్థానం ఆగలేదు. ప్రస్తుతం మన పెదన నియోజకవర్గ వ్యాప్తంగా నిరంతరాయంగా, అత్యంత వేగంగా మరెన్నో సరికొత్త నూతన అభివృద్ధి పనులు మరియు మౌలిక వసతుల కల్పన శరవేగంగా కొనసాగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రతి పల్లెను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కొత్త ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నియోజకవర్గంలోని ప్రతి అర్హుడైన లబ్ధిదారునికి నేరుగా చేరుతున్నాయి. పెడన నియోజకవర్గం అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని హోంమంత్రి అనిత పట్ల అనుచితంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మీరు ఇలాగే వెళ్తే గతంలో వచ్చిన 11 సీట్లు రాకపోగా ప్రజలు పూర్తిగా మర్చిపోతారని అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా కార్యదర్శి గోపు సత్యనారాయణ బిజెపి జిల్లా నాయకులు పుప్పాల రాము బిజెపి నియోజకవర్గ నాయకులు మాగంటి గంగరాజు జనసేన నియోజకవర్గ నాయకులు పంచకర్ల సురేష్ కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు..

# వృద్ధుల సమక్షంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ పుట్టినరోజు వేడుకలు




**కాకినాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** జన్మదిన వేడుకలు రెడ్ క్రాస్ ఓల్డేజ్ హోమ్ (వలసపాకల)లో జరుపుకోవడం తన పూర్వజన్మ శకృతం అని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. కాకినాడలోగల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి ఓల్డేజ్ హోమ్ లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ జన్మదిన వేడు కలను ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకురాలు దుర్గాడ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కూటమి నాయకులు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీకి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభకాంక్షలు తెలియజేసారు.అనంతరం కూటమి నాయకులు ఏర్పాటు చేసిన జన్మదిన కేక న్ను ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ వృద్ధులతో కలసి కట్ చేసి సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు అంత పుట్టిన రోజు పాటను పాడి ఆమెకు అక్షంతలు వేసి ఆశీస్సులు అందజేసారు. అనంతరం ఎమ్మెల్సీ పద్మశ్రీ వృద్ధులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి సహపంక్తి భోజనం చేసారు. కొంత మంది వృద్ధులు పద్మశ్రీతో కలసి సెల్ఫీలు తీయించుకున్నారు. ఈసందర్భం ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడు తూ తన పుట్టిన రోజు వేడుకను తన కుటుంబ సభ్యులతో కాకుండా వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య జరుపుకోవడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఈకార్యక్రమం ఏర్పాటు చేసిన దుగ్గాడ కుమారీని అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకురాలు పటుకార నాగమణి మాట్లాడుతూ ఎమ్మెల్సీ పద్మశ్రీ తన పుట్టిన రోజు వేడుకలను నిరాడంబరంగా వృద్ధుల మధ్య జరుపుకోవడం అభినందనీయం అన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు ముంజులూరి అనంతలక్ష్మి, కాకర్ల కృష్ణవేణి, వంకా వరలక్ష్మీ పలువురు కూటమి నాయకులు మహిళలు వృద్ధాశ్రమం నిర్వహకులు వీరభద్రరావు, వృద్ధులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం..

## -జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





**కిర్లంపూడి,జూన్ 17 (వార్తాప్రభ) :** ప్రజా ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండల సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం గ్రామంలో 36 లక్షల రూపాయలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ ను జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. రామకృష్ణాపురం చేరుకున్న జ్యోతుల నెహ్రూకు గ్రామ టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ కంటా శ్రీను ఆధ్వర్యంలో గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్య పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో స్మశాన వాటికకు వెళ్లేందుకు ఏలేరు కాలువపై వంతెన నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి, ఎం పి డి ఓ, బాయిశెట్టి హరికృష్ణ,ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీపీ తోట రవి,వీరవరం, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షులు తోట గాంధీ,కుర్ల చినబాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంరెడ్డి కాశీబాబు, టిడిపి నాయకులు చదరం చంటిబాబు,తూము కుమార్,జ్యోతుల రాంబాబు,గంధం ఈశ్వరరావు,గొడే దొరబాబు, నీలం శ్రీను,తూము శ్రీ రామమూర్తి, అనుకుల శ్రీకాంత్,గౌతు చిన్న,పాఠంశెట్టి మురళీకృష్ణ,మంచికంటి శ్రీను,జంపన రవివర్మ,సూతి శ్రీను,గండే కాశీ, కందా సత్యానందం,పలువురు వైద్య సిబ్బంది,పంచాయతీరాజ్ శాఖ డిఇ,వై ఉమాశంకర్,ఇంచార్జ్ ఏ ఇ, పి నిరుపం, టెక్నికల్ అసిస్టెంట్ సిద్దు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188